C RMK01B184



రష్యన్ జానపద కథలు

స్వేచ్ఛానువాదం
అనిల్ బత్తుల

RMK01B184

రష్యన్

జానపద కథలు

స్వేచ్ఛానువాదం

అనిల్ బత్తుల

తెలుగు రీడర్స్ క్లబ్
హైదరాబాద్

Russian Janapada Kathalu
Anil Battula

First Edition:
August 2017

Publication no.1

Book Design:
Brahmam Bhavana Grafix,
Hyderabad, 9848254745

Printed at:
Karshak Art Printers
Hyderabad

For Copies:
Anil Battula
S/o. B. Pedda Poli Reddy
6-21, Ashok farm post
Nizamabad Mandal & District
Telangana-503001
Mobile: 9676365115
E.Mail: telugureadersclub@gmail.com
http://sovietbooksintelugu.blogspot.in

All leading book shops in
Telangana & Andhra Pradesh
E.book: kinige.com

₹ 100/-
$ 5

హాయ్ చిన్నారులూ!

బాగున్నారా?

నేను మీ పెద్దన్నయ్యని. ఈ అనువాదం వెనకున్న బుజ్జి కథను చెప్తాను వింటారా?

కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో డిగ్రీ చదివే రోజుల్లో, కోఠిలో 'విశాలాంధ్ర క్లియరెన్స్ సేల్'లో సోవియట్ పుస్తకాల్ని చూశాను. అవి చదివాక, మిగిలిన సోవియట్ తెలుగు పుస్తకాలన్నీ సేకరించి చదవాలన్న కోరిక కలిగింది.

అద్భుతమైన బొమ్మలున్న పిల్లల కథలంటే మీలాగే నాకూ చాలా ఇష్టం. అలా మూడు వందల సోవియట్ ఇంగ్లీష్ పిల్లల పుస్తకాల్ని సేకరించాను. వీటిలో సుమారు రెండు వేల జానపద కథలున్నాయి. ఈ పుస్తకాలతో 'సోవియట్ సాహిత్యంతో ఓ సాయంత్రం' అన్న పుస్తక ప్రదర్శన కూడా నిర్వహించాను. మీలో ఎవరైనా ఆ పుస్తక ప్రదర్శన చూశారా?

నేను సేకరించిన పుస్తకాల్లో నన్ను బాగా ఆకట్టుకున్నది 'సోవియట్ జానపద కథలు' అనే పుస్తకం. నాకెంతో ఇష్టమైన ఆ పుస్తకాన్ని నేనే అనువాదం చేసి మీకు అందించాలన్న తపన కలిగింది. ఈ కథలు మిమ్మల్ని బంగారు కలల ఊహాలోకంలో విహరింపచేస్తాయి. మిమ్మల్ని రంగుల ప్రపంచంలోకి తీసుకువెళ్తాయి. పిల్లల కథల మీదున్న ప్రేమే నన్ను అనువాదకుడిని చేసింది.

మీకోసం అనువాదం చేసిన ఈ కథలు చదివి మీ ఆనందం నాతో పంచుకుంటారు కదూ!

అనిల్ బత్తుల

కృతజ్ఞతలు

ఈ స్వేచ్ఛానువాదాన్ని ఈ రూపంలో తేవడానికి సహకరించిన మిత్రులందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. ఈ రచనకు నన్ను ప్రోత్సహించినవారు–

కడుపు గంగాధర్‌రావు
కె.ఎన్. మల్లీశ్వరి
కుమార్ కూనపరాజు
కిరణ్ చర్ల
కొత్త రవికిరణ్
బి. అజయ్ ప్రసాద్
తల్లావఝుల లలితప్రసాద్
బంగారు బ్రహ్మం
అయిల సైదాచారి లకు...

నా తల్లిదండ్రులు
బత్తుల మహాలక్ష్మమ్మ
బత్తుల పెద్దపోలిరెడ్డి...

నా భార్య మాధవిలతకు...

కూ.. చుక్... చుక్....

1.	బుజ్జి పిచుక	– మాక్సిం గోర్కీ	7
2.	అన్నా చెల్లెళ్ళు	– అలెక్సెయ్ తొలెస్తోయ్	11
3.	పన్నెండు నెలలు	– శామ్యూల్ మార్షాక్	15
4.	అన్నదమ్ములు	– యాన్‌గెన్నీ షవర్ట్స్	19
5.	వెండి గిట్ట	– పావెల్ బజోవ్	23
6.	ఏడు రంగుల పువ్వు	– వాలెంటినా కతయేవ్	27
7.	మేలు మరవని పిచుక	– కాన్‌స్టాంటిన్ పోస్తోవ్‌స్కీ	31
8.	నీలం రాయి	– అర్కాది గైదార్	34
9.	మెరిసే సీతాకోకచిలుక	– ఆంద్రి ప్లటొనోవ్	37
10.	స్నేహం కోసం	– బొరిస్ జకోదర్	40

11. సుల్తాన్ మురాట్ పట్టణానికెళ్ళాడు – చింగీజ్ ఐత్‌మాతోవ్ 43
12. శీతాకాలపు కథ – రెవాజ్ ఇవానిష్‌విలి 47
13. పిల్లవాడు – ఒంటె – కయ్యూం తంగ్రీకుల్‌యెవ్................. 51
14. చెట్టు రహస్యం – లతీఫ్ ముఖ్‌ముదోవ్ 54
15. బుజ్జి కుందేలూ ఇక సెలవ్ – పావెల్ కొవెల్యొవ్ 60
16. గుఱ్రపు స్వారీ – దుకెన్‌బొయ్ దొజ్‌హనోవ్ 63
17. మాయా ఉంగరం – కాన్‌స్టాంటిన్ పోస్తోవ్‌స్కీ.................. 66
18. ఇసుక తుఫాను – కయ్యూం తంగ్రీకుల్‌యెవ్................. 69
19. బుల్ ఫైటర్స్ – సెవ్‌లొడ్ నెస్తాయ్‌కొ...................... 71
20. మంచు బిందువులు – స్పిరిడాన్ వెంగి........................... 74

బుజ్జి పిచుక

మాక్సిం గోర్కి

అనగనగా ఒక బుజ్జి పిచుక ఉండేది. దాని పేరు పూడిక్. దాని వెచ్చటి గూడు, స్నానాలగది కిటికిలో ఉంది. పూడిక్‌కి ఇంకా ఎగరటం రాదు. అది తన బుజ్జి రెక్కలను టప టపమని విదల్చగలదు. తన చిన్ని తలను గూడు బయటకిపెట్టి ప్రపంచాన్ని ఆసక్తిగా గమనిస్తుంటుంది. దానికి ఓపిక తక్కువ. అది గడుగ్గాయి.

"ట్వీట్, ట్వీట్, ఏం చేస్తున్నావ్?" తల్లి పిచుక పూడిక్‌ని అడిగింది.

"క్రింద చాలా చీకటిగా ఉందమ్మా" సమాధానమిచ్చింది పూడిక్.

తండ్రి పిచుక కొన్ని పురుగులను ఆహారంగా తెచ్చింది. వాటిని తినేశాక పూడిక్, మళ్ళీ తల బయటపెట్టి చూసింది.

"జాగ్రత్త చిన్నారి పడిపోతావ్" తల్లి హెచ్చరించింది.

"నేను పడనుగా" అంది పూడిక్ గడుసుగా.

"క్రింద పిల్లి ఉంటే అది నీ పని పడుతుంది" తండ్రి పిచుక హెచ్చరించి, వేటకు వెళ్ళిపోయింది.

అలా కొన్ని రోజులు గడిచాయి. ఒకరోజు గట్టిగా గాలి వీచింది.

"ట్వీ....ట్! ట్వీ....ట్! ఏంటిది అమ్మా?" అడిగింది బుజ్జి పూడిక్.

"అది గాలి, ఎక్కువగా వీస్తే మన గూడు గాలికి ఎగిరి, క్రింద పడిపోతుంది. అప్పుడు నువ్వు పిల్లి నోట్లో పడతావు" అన్నది తల్లి పిచుక.

"అమ్మా! చెట్లను ఊగొద్దని చెప్పు, అప్పుడు గాలి ఆగిపోతుంది" అంది పూడిక్.

పూడిక్‌కి విషయం అర్థమయ్యేలా చెప్పటానికి అమ్మ ప్రయత్నించింది. కాని పూడిక్ నమ్మలేదు.

ఒక మనిషి స్నానాలగది నుండి నడిచి వెళ్తున్నాడు. పూడిక్ అతడిని చూసి ఇలా అంది.

"గండుపిల్లి ఆ మనిషి రెక్కలను తినేసినట్లుంది. కేవలం అతనికి ఎముకలే మిగిలాయి."

"అతడు మనిషి, మనుషులకు రెక్కలుండవు" అంది అమ్మ.

"ఎందుకు?" అడిగింది పూడిక్.

"మనుషులకు రెండు కాళ్ళు వుంటాయి.వాటితో నడుస్తారు"

"ఎందుకు?" రెట్టించి మళ్లీ అడిగింది బుజ్జి పూడిక్.

"ఎందుకంటే మనుషులకు రెక్కలుంటే, వాళ్ళు మనల్ని వేటాడుతారు. నేను, నాన్న పురుగుల్ని వేటాడినట్లు." అంది అమ్మ.

8 (a)

8(b)

“నేను నమ్మను, అందరికీ రెక్కలు ఉండే ఉంటాయి” అంది బుజ్జి పూడిక్ మొండిగా.

అమ్మ మాటలు నమ్మకుంటే, ఇబ్బందుల్లో పడుతుంది అన్న విషయం పూడిక్‌కు తెలియదు. అది బుజ్జి పిచుక గదా!

పూడిక్ గూడు అంచులో కూర్చొని ఇలా పాట పాడింది..

“రెక్కల్లేని మనుషుల్లారా!

మీ కాళ్ళెందుకు పనికొస్తాయి?

మీరు పెద్దవాళ్ళు కావచ్చు,

పొడుగువాళ్ళు కావచ్చు,

కాని ఏం లాభం?

మీరు గాల్లోకి ఎగరలేరు

నన్ను చూడండి, చాలా బుజ్జిదాన్ని

కాని నేను ఎగరగలను.... పురుగులను తినగలను

నేనే గొప్ప... నేనే గొప్ప...!!

అలా పాడుతూ... పాడుతూ... అది గూడు నుండి జారి క్రింద పడింది. అది చూసి తల్లి పిచుక, దాన్ని వెంబడించింది. కానీ అప్పటికే పచ్చటి కళ్ళతో ఉన్న గండుపిల్లి, పూడిక్ వైపు గుర్రుగా చూసింది. పూడిక్ భయంతో గజగజ వణికింది. తన బుజ్జి రెక్కలను చాపి ఇలా అంది.

“మిమ్మల్ని చూడటం చాలా సంతోషంగా ఉంది, పిల్లి గారు!”.

వెంటనే తల్లి, పూడిక్‌ని ప్రక్కకు నెట్టింది. ధైర్యంగా తన ముక్కును తెరిచి పిల్లి కళ్ళలోకి సూటిగా చూసింది. తన రెక్కలను విదిలించి, ముక్కుతో పొడుస్తూ తల్లి పిచుక, పిల్లితో భీకరంగా పోరాడింది.

కదలకుండా నిల్చున్న బుల్లి పిచుకను చూసి "పూడిక్! త్వరగా ఎగురు" అంది తల్లి.

భయంతో పూడిక్, ఒక్కసారిగా తన బుజ్జి రెక్కలను గాల్లో విదిలించి ఒక్క గెంతు గెంతింది. గాల్లోకి ఎగిరింది. క్షేమంగా గూటిని చేరింది. పిల్లితో పోరాటంలో తోకను పోగొట్టుకున్న తల్లి కూడా, గూడును చేరింది. బుజ్జి పూడిక్ తలపై తల్లి ముద్దుపెట్టుకుంది.

"అన్నీ ఒక్కరోజులో నేర్చుకోలేవు నా చిన్నారి పూడిక్" అంది తల్లి.

క్రింద పిల్లి ఆహారం కోల్పోయిన బాధతో గూడు వంక చూస్తుంది.

ఇదండీ బుజ్జి పిచుక పూడిక్ కథ! పిల్లలూ! పెద్దల మాట వినాలి మరి!

★ ★ ★

English Title : The Little Sparrow
Writer : Maxim Gorky
English Translation : Robert Daglish

మాక్సిం గోర్కి (1868–1936):
దుర్భర దారిద్రం నుండి రష్యన్ మహారచయితగా ఎదిగాడు. గోర్కి రాసిన 'అమ్మ' నవల యావత్ ప్రపంచాన్ని విప్లవం వైపు నడిపించింది. మూడు భాగాలయిన గోర్కి ఆత్మకథ 'నా బాల్యం', 'నా బాల్య సేవ', 'నా విశ్వవిద్యాలయాలు' తప్పక చదవవలసిన పుస్తకాలు.



అన్నా చెల్లెళ్ళు

అలెక్సేయ్ తొలెస్తోయ్

అనగనగా ఒక ఊరిలో ఓ నీటి దెయ్యం కొలనులో నివసించేది.

అది వేసవి కాలం.

రాత్రిళ్ళు ఆ నీటి దెయ్యం కొలనులో ఉన్న చెట్ల తొర్రలో జీవించేది.

ఆ కొలను పక్కన ఒక చిన్న గుడిసెలో ఇవాన్, మరియా ఉండేవారు.

వాళ్లు అన్నాచెల్లెళ్ళు. రాత్రివేళ చంద్రుడు కొలను మీదకు వచ్చినప్పుడు నీటి దెయ్యం, పెద్ద గడ్డంతో, నల్లటోపీ పెట్టుకొని పైకి వచ్చేది.

"మరియా, నువ్వు జాగ్రత్తగా వుండాలి. లేదా నీటి దెయ్యం నిన్ను నీళ్ళలోకి లాగేస్తుంది" అని హెచ్చరించేవాడు ఇవాన్.

"నేను ఇంట్లో లేనప్పుడు, రాత్రివేళ అసలు గడప దాటి బయటకు వెళ్ళొద్దు, పాటలు పాడవద్దు, బుజ్జి ఎలుకలా ఇంట్లోనే ఉండు" అని జాగ్రత్తలు చెప్పేవాడు ఇవాన్.

"అలాగే అన్నయ్యా" అంది మరియా.

ఆహారం కోసం ఇవాన్ అడవిలోకి వెళ్ళాడు. రోజంతా ఇంట్లో వుండి మరియాకు విసుగు పుట్టింది. ఇలా పాట పాడటం మొదలుపెట్టింది.

ఓ బంగారు చంద్రుడా!
కొలనుపై నువ్వు నడవలేవా?
ఈ కొలనులోకి చూడు
పువ్వులతో ఎంత అందంగా వుందో!

ఉన్నట్టుండి తన భుజాన్ని ఎవరో తట్టినట్లనిపించింది మరియాకు.

"ఎవరు?" గట్టిగా అరిచింది.

"మా వద్దకు రా...! మా వద్దకు రా...! నీవే మా యువరాణివి" అన్న గుసగుసలు వినిపించాయి.

గుడిసె బయటకు వచ్చి చూసింది. కొలను నుంచి తన గుడిసె దాకా రంగు రంగుల చిత్ర విచిత్రమైన అందమైన పూలు ఒక దారిలా పరిచివున్నాయి. అవి నవ్వుతున్నాయి, ఆడుకుంటున్నాయి. మరియా భయంతో అరిచింది. తప్పించుకోవాలని ప్రయత్నించింది. కాని లాభం లేకపోయింది. అవి పూల కిరీటాన్ని మరియా తలపై పెట్టాయి.

ఉన్నట్టుండి పూల వెనుక నుండి నీటిదెయ్యం ప్రత్యక్షమయ్యింది.

"మరియా! నీకోసం నేను ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నాను" అంటూ ఆ దెయ్యం

12A

తన పొడవైన చేతులతో మరియాను బంధించింది.

ఉదయాన్నే ఇవాన్ ఇంటికి వచ్చాడు. తన ముద్దుల చెల్లెలు మరియా కనిపించలేదు. చుట్టుపక్కలంతా వెతికాడు. చివరికి కొలను బయట మరియా చెప్పులు కనిపించాయి.

పాపం ఇవాన్, ఎంతో ఏడ్చాడు.

కొన్ని రోజుల తర్వాత. 'వేరే చోటికి వెళ్లి బతుకుతాను' అని తనలో తాను గొణుక్కున్నాడు ఇవాన్.

బూట్లు పాడయిపోయాయి. కొత్త బూట్లు తయారుచేసుకోవడానికి కొలను వద్ద ఉన్న నిమ్మచెట్టు బెరడును వొలిచాడు. బూట్లు తయారుచేసుకున్నాడు.

ఇంటికి బయలుదేరాడు. ఎంత నడిచినా చివరికి ఆ నిమ్మచెట్టు వద్దకే వస్తున్నాడు. ఇది ఖచ్చితంగా మంత్రాల పనే అనుకున్నాడు. ఇవాన్‌కి కోపం వచ్చింది. తన ఒరలోని గొడ్డలితో నిమ్మచెట్టుని నరకబోయాడు.

"అన్నయ్యా! నన్ను నరకొద్దు" అన్న మాటలు నిమ్మచెట్టు నుండి వినిపించాయి.

"చెల్లెమ్మా! ఇది నువ్వా?" అని ఏడ్చాడు ఇవాన్.

"అవునన్నయ్యా నేనే, ఆ నీటి దెయ్యం నన్ను బలవంతంగా పెళ్ళిచేసుకొని చెట్టులా మార్చింది" అంది మరియా.

"మరి నీకు శాపవిమోచనం లేదా?" అడిగాడు ఇవాన్.

"ఒక మార్గముంది. ఆకాశంలోని మంత్రపుష్పాన్ని సంపాదిస్తే, నేను తిరిగి మానవ రూపంలోకి మారతాను" అంది మరియా.

సరే అని బయలుదేరాడు ఇవాన్.

అతని బూట్లు అలవోకగా అతన్ని ఆకాశంపైకి లాక్కెళ్ళాయి. ఆకాశంలో మేఘాల వెనక, తన భుజాన్ని ఎవరో తట్టినట్టు అనిపించింది. తిరిగిచూస్తే ఓ బలమైన మరుగుజ్జు

కనిపించాడు. ఇవాన్ తన కథ చెప్పి మంత్రపుష్పం గురించి అడిగాడు.

"నాతో యుద్ధం చేసి గెలిస్తే, మంత్రపుష్పం నీదే" అన్నాడు మరుగుజ్జు.

ఇద్దరి మధ్య భీకరమైన పోరు జరిగింది.

చివరికి ఇవాన్ గెలిచాడు.

మంత్రపుష్పం సాధించాడు.

కొలనువద్దకు వచ్చి, నీటి దెయ్యం మొహంమీద మంత్రపుష్పంతో కొట్టాడు.

నీటి దెయ్యం పొట్టపగిలి, చచ్చి, కొలనులో కలిసిపోయింది.

నిమ్మచెట్టు మరియాలా మారిపోయింది. అన్నా చెల్లెళ్ళు ఆనందంతో కౌగిలించుకున్నారు.

ఈ రోజుకీ వాళ్ళు కలిసే జీవిస్తున్నారు. ఇదండీ పిల్లలూ! అన్నా చెల్లెళ్ళ అనుబంధం.

★ ★ ★

English Title : Evan and Maria
Writer : Alexie Tolstoy
English Translation : James Riordan

అలెక్సేయ్ తాల్‌స్తోయ్ (1883-1945):
ప్రసిద్ధ రష్యన్ సైన్స్‌ఫిక్షన్ రచయిత. ఇతను రాసిన 'అయిలిత' అన్న సైన్స్‌ఫిక్షన్ నవల అంగారక గ్రహంలో సాగుతూ ఉత్కంఠభరితంగా ఉంటుంది.

పన్నెండు నెలలు

శామ్యూల్ మార్షాక్

'సంవత్సరంలో ఎన్ని నెలలుంటాయో తెలుసా?'

'పన్నెండు'.

'వాటి పేర్లు తెలుసా?'

'జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రియల్, మే, జూన్, జులై, ఆగస్ట్, సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్, డిసెంబర్'.

ఒక నెల పూర్తికాక ముందు, ఇంకో నెల మొదలవదు. అవి ఒకదాని వెనుక ఒకటి వస్తాయి. అవి ఎప్పటికీ కలవవు. కాని ఒక ఊరిలో ఓ చిన్న పాప, ఆ పన్నెండు నెలలను

ఒకేసారి చూసిందని చెప్పుకుంటారు. ఆ కథ మీకిప్పుడు చెప్తాను వినండి.

అనగనగా ఒక ఊరిలో పిసినారి చెడ్డ మహిళ ఉండేది. ఆమె, తన సొంత కూతురు, సవతి కూతురితో కలిసి నివసించేది. సొంత కూతురిని ప్రేమగా చూసుకునేది. సవతి కూతురిని చీటికి మాటికి తిడుతూ రాచి రంపాన పెట్టేది. ఆమె సొంత కూతురు గారాబంగా, బద్ధకంగా పెరిగేది.

ఒకసారి జనవరి నెలలో, చలికాలంలో, ఊరి ప్రజలంతా ఇళ్ళలో వెచ్చగా ఉన్నారు. చెడ్డదైన తల్లి, తన సవతి కూతురుతో ఇలా అంది.

"అడవిలోకి వెళ్ళి మంచుగడ్డలు బుట్టనిండా ఏరుకొనిరా. రేపు నీ చెల్లి పుట్టినరోజు. ఒకవేళ మంచుగడ్డలు దొరకలేదనుకో, ఇంటికి రావొద్దు. అడవిలోనే చావు."

సవతి కూతురు ఇది విని, కళ్ళనిండా నీళ్ళు పెట్టుకొని బాధపడింది. ఎందుకంటే మంచుగడ్డలు జనవరిలో దొరకవు. మార్చి నెలలో అయితే దొరుకుతాయి. ఇది ఖచ్చితంగా తన మీద కోపంతో చెప్పిన పని అని తెలిసినా, చేసేదేమీ లేక, బుట్ట చేతపట్టుకుని వడివడిగా అడవిలోకి బయలుదేరింది.

అసలే ఎముకలు కొరికే చలికాలం, చిమ్మచీకటి. ఆకాశంలో ఒక్క నక్షత్రం కూడా లేదు.

అడవిలో ఓ మూల నున్న చెట్టును ఆనుకుని నిలబడింది. ఒక్కసారిగా ఉన్నట్టుండి ఓ మెరుపు లాంటి వెలుగు కనిపించింది.

ఆ వెలుగు ఉన్న ప్రదేశానికి వెళ్ళింది.

అక్కడ చలిమంట ఉంది.

దాని చుట్టూ పన్నెండుమంది మనుషులున్నారు. వాళ్ళను చూసి ఆశ్చర్యపోయింది. వాళ్ళు చాలా అందంగా ఉన్నారు. ఖచ్చితంగా వేటగాళ్ళు కారు. వాళ్ళలో చిన్న పిల్లలు, మధ్యవయస్కులు, ముసలివాళ్ళు ఉన్నారు. ఒక ముసలాయన పాపవద్దకు వచ్చి, ఏం కావాలని అడిగాడు.

16 B

'మంచుగడ్డల' కోసం వచ్చానని చెప్పింది. వాళ్ళు నవ్వారు.

"జనవరిలో మంచుగడ్డలు దొరకవు, మార్చిలో రా, అప్పుడు దొరుకుతాయి" అన్నారు.

పాప తన సవతితల్లి గురించి చెప్పింది. మంచుగడ్డలు లేకుండా ఇంటికి వెళ్తే, చావబాదుతుందని, తను మార్చి నెల వచ్చేవరకు ఈ అడవిలోనే ఎదురుచూస్తానని చెప్పి పాప ఏడ్చింది. వాళ్ళల్లో చిన్నపిల్లవాడు వాళ్ళ అన్న దగ్గరకు వెళ్ళి ఇలా అన్నాడు, "అన్నయ్యా జనవరి! నేనో గంట ఇక్కడ ఉంటాను."

జనవరి ఇలా అన్నాడు "తమ్ముడూ మార్చి! నాకు అభ్యంతరం లేదు. కానీ, ఫిబ్రవరి రాకుండా మార్చి రాదు కదా" అన్నాడు.

పక్కనే ఉన్న ఫిబ్రవరి కూడా అందుకు వొప్పుకున్నాడు.

ఆ ముగ్గురి సహకారంతో, అడవిలో ఆ రాత్రివేళ గంటసేపు మంచుగడ్డలు కురిశాయి. అది చూసి పాప ఆశ్చర్యంతో కేరింతలు కొట్టింది. తన బుట్టనిండా మంచుగడ్డలు నింపుకుంది. ఆ పన్నెండుమందికి 'ధన్యవాదాలు' తెలిపి, ఇంటికి బయలుదేరింది.

తల్లి, సవతి కూతురు తెచ్చిన మంచుగడ్డలను చూసి, తన కళ్ళను తానే నమ్మలేకపోయింది. 'ఎలా తెచ్చావని?' గద్దించింది. పాప జరిగిన కథంతా చెప్పింది.

పన్నెండు నెలలు నీకు కావల్సింది కోరుకోమంటే, కేవలం మంచుగడ్డలు తెచ్చావా? అని హేళన చేసింది.

తల్లి సొంత కూతురు ఇలా అంది,

"అమ్మా! నేనైతే ఆపిల్, స్ట్రాబెర్రీ, పుట్టగొడుగులు.. ఇంకా బోల్డన్ని తెచ్చేదాన్ని. అవన్నీ అమ్మితే మనకు బోల్డంత డబ్బొచ్చేది" అంది.

తరువాతి రోజు రాత్రి తల్లి తన సొంత కూతురికి, బుట్ట ఇచ్చి అడవిలోకి పంపింది. ఆ పాప చలిమంట వద్దనున్న పన్నెండుమంది మనుషులను చూసింది. ఏమాత్రం గౌరవం లేకుండా వాళ్ళమధ్యకు వెళ్ళి కూర్చుంది.

"ఏం కావాలి?" అని అడిగారు వాళ్ళు.

"మీరు మా అక్కకి నిన్న రాత్రి మంచుగడ్డలిచ్చారటగా, నాకు ఆపిల్‌లు, స్ట్రాబెర్రీలు, పుట్టగొడుగులు మొదలైనవన్నీ ఇవ్వండి" ఆజ్ఞాపించింది.

వాళ్ళకు కోపం వచ్చి భీకరమైన మంచు తుఫాను సృష్టించారు.

చలి మంట ఆరిపోయింది.

పాప మంచులో కూరుకుపోయింది. సొంత కూతురిని వెతుక్కుంటూ వచ్చిన తల్లి కూడా మంచు తుఫానులో కూరుకుపోయింది.

ఊరిలోని సవతి కూతురు పెరిగి పెద్దదై, పిల్ల పాపలతో సుఖంగా జీవించింది. వాళ్ళ పెరటిలో రకరకాల పూలు, పండ్లు సంవత్సరం పొడవునా ఉంటాయి. ఎందుకంటే పన్నెండు నెలలను ఆ పాప ఒకేసారి కలుసుకుంది కదా! వాళ్ళిప్పుడు స్నేహితులు.

★ ★ ★

English Title : 12 Months
Writer : Samuel Marshak
English Translation : James Riordan

శామ్యూల్ మార్షాక్ (1887-1964):
ప్రసిద్ధ రష్యన్ పిల్లల రచయిత. గోర్కి ఇతనిని 'రష్యన్ బాలసాహిత్య పితామహుడు' అని కీర్తించాడు. స్వతహాగా కవి. షేక్స్‌పియర్ పద్యాలను ఇంగ్లీషు నుండి రష్యన్ భాషలోకి అనువదించాడు.

అన్నదమ్ములు

యావ్‌గెన్నీ షవర్ట్స్

అనగనగా ఒక ఊరిలో ఇద్దరు అన్నదమ్ములుండేవారు. వాళ్ళు చీటికి మాటికీ ఒకరితో ఒకరు పోట్లాడుకుంటూ ఉండేవారు. వాళ్ళ నాన్న, ఇంటి దగ్గరలోని అడవికి అధికారి. ఓ రోజు రాత్రి ఆ పిల్లల తల్లిదండ్రులు గుర్రబ్బగ్గి ఎక్కి నగరానికి బయలుదేరారు.

తండ్రి పెద్దవాడితో, "పెద్దోడా! నేను మీ అమ్మ, నగరానికి వెళ్లి ఓ మూడు రోజుల్లో వస్తాము. నీకు, తమ్ముడికి 'కొత్త సంవత్సరం కోసం బహుమతులు' తీసుకొని వస్తాము. తమ్ముడితో గొడవపడకుండా జాగ్రత్తగా చూసుకో" అన్నాడు.

"సరే, నాన్నా" అన్నాడు పెద్దోడు.

మొదటి రెండు రోజులు ప్రశాంతంగా గడిచాయి.

మూడవరోజు సాయంత్రం ఆరు గంటలయింది. పెద్దోడు 'సింద్‌బాద్ సాహస యాత్రలు' పుస్తకం చదువుతున్నాడు.

కథ ఆఖరిఘట్టంలో ఉంది. చిన్నోడికి చిరాకు పుడుతూ ఉంది. ఏం తోచక పెద్దోడిని కదిలించాడు.

"నన్ను ప్రశాంతంగా ఉండనీయ్" పెద్దోడు అరిచాడు.

చిన్నోడిని తలుపు బయట ఉంచి, గడియ పెట్టుకున్నాడు. అయిదునిమిషాల తరువాత తలుపు తీద్దామనుకున్నాడు. పుస్తకంలో పడి ఆ సంగతే మరచిపోయాడు.

సమయం రాత్రి ఏడు గంటల యాభయైదు నిమిషాలయింది. పెద్దోడికి ఉన్నట్టుండి చిన్నోడు గుర్తొచ్చాడు.

తలుపు తెరచి చూస్తే, చిన్నోడు లేడు. ఎంతో గాలించాడు. లాభం లేకపోయింది. బాధపడ్డాడు. రాత్రి ఎనిమిది గంటలకు తల్లిదండ్రులు వచ్చారు. చిన్నోడి గురించి అడిగారు. జరిగినదంతా చెప్పాడు.

నాన్న పెద్దోడిని చివాట్లు పెట్టి, బయటికి గెంటివేసి, "చిన్నోడిని తీసుకొని వస్తేనే ఇంటికిరా!" అని హెచ్చరించాడు.

అడవంతా గాలించాడు పెద్దోడు. కాని చిన్నోడి జాడ కనిపించలేదు. చాలాదూరం నడిచాడు. మంచుతో కప్పబడిన కొండలు కనిపించాయి. పొడవైన పైన్ వృక్షాలు కనిపించాయి. కాని చిన్నోడు కనిపించలేదు. నేలంతా మంచు. కాని తనకి చలి వేయలేదు.

ఎందుకా అని ఆలోచిస్తూండగా, "నేనే నిన్ను వెచ్చగా వుంచాను" అన్న ఓ గొంతు వినిపించింది.

పెద్దోడు ఆశ్చర్య పోయాడు. "ఎవరు మీరు అడవి తాతా?"

"కాదు, నేను ఈ అడవికి ముత్తాతని" అన్నాడు తెల్లగడ్డంతో పొడవుగా ఉన్న ముసలతను.

"నా తమ్ముడు మీకు కనిపించాడా?" అని అడిగాడు పెద్దోడు.

"నాతో రా చూపిస్తా" అన్నాడు ముత్తాత.

వాళ్ళు చాలాదూరం నడిచాక మంచుతో తయారైన రాజభవనం కనిపించింది. అందులో ప్రతి గోడ, ప్రతి వస్తువు, ఆహారం, పక్షులు, ఉడుతలు, కుందేళ్ళు అన్ని మంచుతో చేసినవి ఉన్నాయి.

అది చాలా పెద్ద గది.

"ఇలాంటి గదులు ఎన్ని ఉన్నాయి ఈ భవనంలో?" అడిగాడు పెద్దోడు.

మొత్తం నలభై తొమ్మిది గదులు. నలభై తొమ్మిదవ గదిలో చిన్నోడు ఉన్నాడు.

"అతను నేను చెప్పినట్టు వినలేదు. అందుకే నలభై తొమ్మిదవ గదిలో బంధించాను, నువ్వు నేను చెప్పినట్టు వినాలి. లేదంటే నీకూ అదే గతి పడుతుంది" అని హెచ్చరించాడు ముత్తాత.

"నీ గది నంబర్ ఇరవై అయిదు" అని చెప్పాడు.

కొన్ని రోజులు గడిచాయి. పెద్దోడు, ముత్తాత చెప్పినట్టు బుద్ధిగా ఉంటున్నాడు. మంచు ఉడుతలను, మంచు కుందేళ్ళను, మంచు పక్షులను, గది మధ్యలోని చలిమంట దగ్గర పెట్టి, మామూలు పక్షులుగా జంతువులుగా మారుస్తున్నాడు.

ఓ రోజు రాత్రి ముత్తాత గురక పెట్టి నిద్రపోతున్నప్పుడు, పెద్దోడు నలభై తొమ్మిదో గదికి వెళ్లాడు. దాని మంచు తలుపు ఎంత కొట్టినా కొంచెం కూడా కదలలేదు. నిరాశగా వెనుదిరిగాడు.

మరికొన్ని రోజులు గడిచాయి. పెద్దోడికి తన జేబులో ఉన్న అగ్గిపెట్టె గుర్తుకు వచ్చింది. అడవిలో కొన్ని దుంగలను ఏరుకొచ్చాడు. నలభై తొమ్మిదో గది బయట వాటిని పేర్చి, నిప్పు పెట్టాడు. కాని తలుపు పగలగొట్టలేకపోయాడు.

పెద్దోడు బతికించిన ఉడుతలు, పిచుకలు, కుందేళ్ళు రోజూ పెద్దోడితో ఆడుకునేవి.

ఓ రోజు రాత్రి ముత్తాత గాఢ నిద్రలో ఉండగా, ఓ ఉడుత ముత్తాత దగ్గర నుండి 'మంచు తాళం గుత్తి' దొంగిలించి పెద్దోడికిచ్చింది. పెద్దోడు నలభై తొమ్మిదో గదికి వెళ్లాడు. తాళం పెట్టడానికి చోటు కనిపించలేదు. పిచుకలు తమ ముక్కుతో మంచు తలుపుని పొడిచాయి. చివరికి తాళం పెట్టే చోటు కనిపించింది.

తలుపు తెరిచాడు.

మంచుశిలలా మారిన చిన్నోడు దిగులుగా కనిపించాడు. చిన్నోడిని భుజాన వేసుకుని ఆ మంచుభవనం నుండి పారిపోయాడు.

నిద్రలేచిన ముత్తాత వెంబడించాడు. కాని పక్షుల, జంతువుల సహాయంతో తప్పించుకున్నారు.

సూర్యోదయమయింది.

చిన్నోడి ఒంటి మీది మంచు కరిగి మామూలు మనిషయ్యాడు. చిన్నోడు, పెద్దోడు ఆనందంతో ఒకరిని ఒకరు కౌగిలించుకున్నారు. క్షేమంగా ఇంటికి చేరారు. వాళ్ళ తల్లిదండ్రులు, పిల్లలు తిరిగి వచ్చిన ఆనందంతో పండగ చేసుకున్నారు.

★ ★ ★

English Title : Two Brothers
Writer : Yevgeny Shvarts
English Translation : James Riordan

యావ్‌గెన్ని షవర్ట్స్(1896-1958):
రష్యన్ నాటక రచయిత. ఇరవై ఐదు నాటకాలు రచించాడు. మూడు సినిమాలకు స్క్రీన్‌ప్లే అందించాడు. 'డ్రాగన్' అన్న వ్యంగ్య రచన సుప్రసిద్ధం.





వెండి గిట్ట

పావెల్ బజోవ్

అనగనగా ఒక ఊరిలో కొకొవాన్య అనే ముసలి వేటగాడు ఉండేవాడు. అతను ఒంటరివాడు. ఎవరినన్నా పెంచుకుందామని ఇరుగు పొరుగువారిని అడిగాడు. గ్రెగరీ వాళ్ళ పిల్లలు అనాథలని, పెద్ద పిల్లలు కుట్లు అల్లికలకు వెళ్ళిపోయారని, ఓ ఆరేళ్ళ చిన్న పాప దార్యా ఉందని చెప్పారు.

వేటగాడు దార్యాని, ఆ పాప పెంపుడు పిల్లిని ఇంటికి తీసుకొచ్చాడు. వేటగాడు మేకలను వేటాడటానికి అడవిలోకి వెళ్ళేవాడు. దార్యా ఇల్లు సర్దేది. పిల్లి ఎలుకలను వేటాడేది. రాత్రిళ్ళు వేటగాడు, పాపకి, పిల్లికి ఎన్నో చిత్ర విచిత్రమైన కథల్ని చెప్పేవాడు.

ఒకరోజు వేటగాడు ఒక వెండి గిట్ట ఉన్న మేక గురించి చెప్పాడు. తను ఎంతో

కాలంగా దాని కోసం వెతుకుతున్నానని చెప్పాడు. పాపకు ఈ విషయం ఎంతో ఆసక్తి కలిగించింది. అప్పటి నుండి ఆ మేక గురించే అడిగేది.

"తాతా! తాతా! ఆ మేకకు ఎన్ని కొమ్ములుంటాయి?" అడిగింది పాప.

"ఐదు" అని చెప్పాడు తాత.

"ఆ మేకకు వెండి గిట్ట ఏ కాలుకు ఉంటుంది? దాని వల్ల ఉపయోగమేమిటి?" అడిగింది పాప.

"ఆ మేక కుడి కాలుకు వెండి గిట్ట ఉంటుంది. అది దాని కుడి కాలుతో నేలను ఒకసారి కొడితే ఒక వజ్రం లేదా రత్నం రాలుతుంది. అది రెండుసార్లు నేలను కొడితే రెండు వజ్రాలు రాలుతాయి. అది నేలను బరికితే వజ్రాల కుప్పే" అన్నాడు తాత.

"ఆ మేక శరీరం నుండి ఏ వాసన వస్తుంది?" అడిగింది పాప.

"అది మామూలు మేక కాదు. అడవి మేక. దాని శరీరం నుండి అడవి సువాసన వస్తుంది" అని చెప్పాడు తాత.

కొన్ని నెలల తర్వాత శీతాకాలంలో మేకల వేట కోసం, అడవిలోకి చాలాదూరం వెళ్ళాల్సి వచ్చింది వేటగాడికి. కొన్ని రోజుల వరకు రానని చెప్పాడు.

"మరి రాత్రిళ్ళు అడవిలో ఎలా ఉంటావు?" అడిగింది పాప.

"అక్కడ మనకో వెచ్చటి గుడిసె ఉంది" అన్నాడు తాత.

"మరి అక్కడకు వెండి గిట్ట మేక వస్తుందా?"

"ఏమో తెలీదు. వస్తే రావచ్చు".

"మరైతే నేనూ వస్తా. నన్నూ నీతో తీసుకుపో" అని ఏడ్చింది.

వద్దని సర్దిచెప్పటానికి ప్రయత్నించినా వినలేదు. తప్పని పరిస్థితుల్లో పాపని తీసుకొని స్లెడ్జిబండిపై బయలుదేరారు. పిల్లి వాళ్ళను అనుసరించింది.

అడవిలోని ఇంట్లో పాప, పిల్లి ఉండేవారు. తాత మేకలను వేటాడుకొచ్చి, వాటి తోళ్ళను వేరుచేసి, మాంసాన్ని ఉప్పులో ఊరపెట్టేవాడు.

"తాత! మరి మాంసం చాలా జమయ్యింది. మరి నువ్వు ఇది తీసుకెళ్ళటానికి, ఊరి నుండి గుర్రాన్ని తెచ్చుకో" అంది పాప.

"తెలివైన పిల్లవి నువ్వు" అని చెప్పి, ఊర్లోకి బయలుదేరాడు తాత.

మొదటిరోజు రాత్రి కిటికి దగ్గర కూర్చున్న పాపకు వెండిగిట్ట ఉన్న మేక, ఐదు కొమ్ములతో కనిపించింది.

కల అనుకుంది పాప. రెండవ రోజు రాత్రి కూడా కనిపించింది.

ఈ విషయాన్ని పిల్లికి చెప్పింది. ప్రతీరోజూ దిగులుగా తాత కోసం ఎదురుచూసేది.

మూడవరోజు రాత్రి ఇంటిపై ఎవరో కదులుతున్నట్లు, తలుపులు తట్టినట్టు అనిపించింది. ధైర్యంగా తలుపులు తీసి బయటకు వెళ్ళి చూసింది.

వెండిగిట్ట మేక కొన్ని వజ్రాలను అప్పటికే రాల్చింది.

పిల్లికి కోపం వచ్చి మేకను గుర్రుగా చూసింది.

మేక పిల్లిని వెంబడిస్తూ తన వెండిగిట్టను నేలకేసి కొడుతూ ఉంది. అలా పిల్లి, మేక ఇంటి చుట్టూ చాలాసార్లు తిరిగాయి. ఇంటి పైకప్పు మీదకి గెంతాయి.

ఇంటి చుట్టుపక్కల, ఇంటి పైకప్పు అంతా ఎరుపు, పచ్చ, పసుపు రత్నాలు, వజ్రవైఢూర్యాలతో నిండిపోయింది. ఆ ప్రదేశమంతా కళ్ళు మిరుమిట్లు గొలిపే కాంతితో నిండిపోయింది.

అప్పుడే అక్కడకు గుర్రంమీద చేరిన తాత, ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. తన టోపీ నిండుగా వజ్రాలను ఏరాడు. వెండి గిట్ట మేక, పిల్లి హఠాత్తుగా మాయమయ్యాయి.

"తాత! ఇంటిపైనున్న వజ్రాలను ఏరవద్దు, మనం ప్రొద్దునదాకా ఈ అందమైన

దృశ్యాన్ని చూద్దాం" అంది పాప.

రాత్రి మంచు కురిసింది. ప్రొద్దున పైకప్పునున్న మంచు తొలగించి చూస్తే వజ్రాలు కూడా మాయమయ్యాయి.

అయితేనేం, వాళ్ళ వద్ద టోపీ నిండుగా వజ్రాలున్నాయి. తమకు అవి చాలు, అనుకున్నారు.

పాప, తాత ఆనందంతో ఊరికి చేరారు.

★ ★ ★

English Title : Silver Hoof
Writer : Pavel Bazhov
English Translation : James Riordan

పావెల్ బజోవ్ (1879-1950):
రష్యన్ రచయిత. తను పుట్టిన ప్రాంతమైన ఉరల్స్‌కి సంబంధించిన జానపద కథలు రాసి ప్రసిద్ధుడయ్యాడు. ఇతని మీద రష్యన్ ప్రభుత్వం, ఓ డాక్యుమెంటరీని కూడా రూపొందించింది.

ఏడు రంగుల పువ్వు

వాలెంటినా కతయేవ్

అనగనగా ఒక ఊరిలో జెన్యా అనే చిన్న పాప ఉండేది. ఆ పాప అంగడిలో రొట్టెలను కొనుక్కుని, వాటిని పూసలు గుచ్చినట్టు దండగా గుచ్చి ఇంటికి బయలుదేరింది. దారిలో ఓ మాయదారి కుక్క వాటిని చడీ చప్పుడు గాకుండా తినేసింది.

పాప ఏడ్చింది.

అప్పుడు ఒక ముసలవ్వ పాప వద్దకు వచ్చి, జరిగిన కథ విని పాపకు తన పెరటిలోని 'ఏడురంగుల పువ్వు' ఇచ్చింది. అది పసుపు, ఎరుపు, నీలం, పచ్చ, నారింజ, ఊదా, లేతనీలం, రంగులు కలిగిన ఏడు రెక్కల పువ్వు.

"ఈ పువ్వు నువ్వు కోరిన కోరికలు తీరుస్తుంది. ఒక రెక్కను తీసి గాలిలో ఎగరేసి

ఈ మంత్రాన్ని చెప్పాలి” అంది ముసలవ్వ.

ఆ మంత్రం :

“ఎగిరిపో పూరేకా.... ఎగిరిపో...
తూర్పు నుండి పడమరకు,
ఉత్తరం నుండి దక్షిణానికి,
నలుదిశల ఎగిరిపో...
నేలను తాకు.. నా కోరిక తీర్చు...”

పాప మొదటి రెక్కయిన పసుపు రెక్కను తుంచి గాలిలోకి ఎగరేసి ముసలవ్వ చెప్పిన మంత్రాన్ని చదివి, “నన్ను త్వరగా రొట్టెలతో ఇంటికి చేర్చు” అని కోరుకుంది.

క్షణంలో పాప ఇంటికి చేరింది.

అమ్మకు రొట్టెల దండ ఇచ్చింది. ఏడురంగుల పువ్వును అటక మీద వున్న అమ్మకిష్టమైన పూల జాడీలో పెట్టాలని చూసింది పాప. ఈలోగా కిటికీ బయట కొన్ని కాకులు వెళ్తున్నాయి. వాటిని లెక్కపెడుతూ జాడీని జారవిడిచింది. భళ్ళున పగిలింది జాడీ. ఏమయిందంటూ అమ్మ కేకేసింది.

పాప రెండవ రెక్కయిన ఎరుపు రెక్కను తుంచి గాలిలోకి ఎగరేసి, మంత్రాన్ని చదివి, “అమ్మకిష్టమైన పూలజాడీ తిరిగి వచ్చుగాక” అంది.

క్షణాల్లో గాజు ముక్కలన్నీ కలిసి అందమైన పూలజాడీ తయారయింది.

ఒకరోజు జెన్యా ఆడుకోవడానికి తోటలోకి వెళ్ళింది. అక్కడ కొంతమంది అబ్బాయిలు ఉత్తర ధృవం మంచు ఆట ఆడుతున్నారు.

“నేనూ ఆడవచ్చా” అనడిగింది జెన్యా. వాళ్ళందుకు వొప్పుకోలేదు.

పాప మూడవ రెక్కయిన నీలం రెక్కని తుంచి గాలిలోకి ఎగరేసి మంత్రం చదివి, “నన్ను ఉత్తర ధృవానికి తీసుకుపో” అంది.

28B

క్షణాల్లో ఉత్తర ధృవంలో, భయంకరమైన మంచులో ప్రత్యక్షమయింది పాప. అక్కడ మంచు ఎలుగుబంట్లు కొన్ని పాప వైపు వస్తున్నాయి.

పాప భయంతో నాలుగవ రెక్కయిన పచ్చ రెక్కని తుంచి గాలిలోకి ఎగరేసి మంత్రాన్ని చదివి, "నన్ను వెంటనే మా ఇంటి పెరట్లోకి తీసుకుపో" అని కోరుకుంది. అనుకున్నట్టుగానే జరిగింది.

ఒక సాయంకాలం పాప పక్కతోటలోని అమ్మాయిలతో ఆడుకోడానికి వెళ్ళింది.

వాళ్ళదగ్గర ఎన్నో అందమైన బొమ్మలున్నాయి. వాళ్ళు జెన్యాని ఆటలో చేర్చుకోడానికి ఒప్పుకోలేదు. పాప కోపంతో అయిదవ రెక్కయిన నారింజ రంగు రెక్కని తుంచి గాలిలోకి ఎగరేసి మంత్రాన్ని చదివి, "లోకంలో బొమ్మలన్నీ నా సొంతమవ్వాలి" అంది.

పాప నోటి నుండి మాట పూర్తయ్యేలోపే బొమ్మల వర్షం కురవటం మొదలయ్యింది. రోడ్లన్నీ బొమ్మలతో నిండిపోయాయి. పాప ఇల్లు, పెరడు, పట్టణం అన్నీ బొమ్మలతో నిండిపోయాయి. నగరమంతా బొమ్మలతో నిండిపోయి రద్దీగా మారింది.

పాప ఆరవ రెక్కయిన ఊదారంగు రెక్కని తుంచి గాలిలోకి ఎగరేసి మంత్రాన్ని చదివి, "లోకంలో బొమ్మలన్నీ ఎక్కడి నుండి వచ్చాయో, అక్కడికే వెళ్ళిపోగాక" అంది.

క్షణాల్లో బొమ్మలన్నీ మాయమయ్యాయి.

పాప వద్ద లేత నీలం రంగు రెక్క ఒక్కటే మిగిలింది. దాంతో ఏం కోరుకుందామా అని ఆలోచిస్తూ నడుస్తూ ఉంది. ఇంతలో ఓ సిమెంటు బెంచిపై దిగులుగా కూర్చుని ఓ పిల్లవాడు కనిపించాడు. ఆ అబ్బాయితో స్నేహం చేద్దామనుకుంది.

"నీ పేరేంటి?" అని అడిగింది.

"వాత్యా" అని చెప్పాడా అబ్బాయి.

"ఆడుకుందామా మనం?" అని అడిగింది జెన్యా.

"నేను ఆడలేనుగా! కుంటివాడిని" అని చెక్క కాలు చూపెట్టాడు ఆ అబ్బాయి.

"బాధపడకు వాత్యా" అంది పాప.

జేబులో నుండి ఆఖరి లేత నీలపు రంగు రెక్కను తుంచి గాలిలోకి ఎగరేసి మంత్రాన్ని చదివి, "వాత్యా కాలు తిరిగి వచ్చుగాక" అంది.

క్షణాల్లో వాత్యా కాలు బాగయ్యింది.

పాప, అబ్బాయి దాగుడుమూతలాట ఆడుకున్నారు.

★ ★ ★

English Title : Rainbow Flower
Writer : Valentin Katayev
English Translation : Fainna Glagoleva



వాలెంటినా కతయేవ్(1897-1986):
రష్యన్ నవలాకారుడు. నాటక రచయిత. ఎన్నో ప్రసిద్ధ రచనలతోపాటు చైతన్యస్రవంతిలో తన ఆత్మకథను రాశాడు.



మేలు మరవని పిచుక

కాన్స్టాంటిన్ పోస్తోవ్స్కీ

అనగనగా ఒక ఊరిలో మాషా అనే చిన్న పాప ఉండేది.

వాళ్ళ అమ్మ బ్యాలే డ్యాన్సర్.

ఆమె త్వరలో 'సిండ్రెల్లా' అనే నాటకంలో ప్రధాన పాత్రలో నటించనుంది.

మాషా వాళ్ళ నాన్న సైనికుడు. అతడు యుద్ధం చేయడానికి వెళ్ళాడు.

వెళ్ళేముందు అతను ఒక గాజు పూలగుత్తిని మాషా వాళ్ళ అమ్మకు బహుమతిగా ఇచ్చాడు. మాషా వాళ్ళ అమ్మ దాన్ని రోజూ అపురూపంగా చూసుకునేది. సిండ్రెల్లా నాటకం ప్రదర్శించినపుడు, ఆ గాజు పూలగుత్తిని తన గౌనుకు ధరించాలని అనుకుంది.

ప్రతి రోజూ మాషా కిటికి దగ్గర నుంచుని చుట్టుపక్కల చూస్తుండేది. కాకులు, పిచుకలు చక్కర్లు కొడుతూ కనిపించేవి. ఓ రోజు మాషా తన గదిలో ఆట బొమ్మలతో ఆడుకుంటుంది.

ఇంతలో ఓ కాకి కిటికీలో నుంచి వచ్చి బల్లపై ఉన్న గాజు పూలగుత్తిని ముక్కున కరుచుకుని చక్కా వెళ్ళిపోయింది. ఇది చూసి మాషా పెద్దగా అరిచింది. జరిగింది తెలుసుకున్న మాషా వాళ్ళ అమ్మ ఎంతో బాధపడింది.

మాషా వాళ్ళ ఇంటి ప్రక్కనున్న ఉద్యానవనం దగ్గరలో ఓ ఐస్‌క్రీం బండి ఉండేది. అది ప్రస్తుతం మూసివేసి ఉంది.

పాష్కా అనే పిచుక ఆహారం కోసం ఐస్‌క్రీం బండిలో దూరాలని చూసింది. పూర్వం బోల్డన్ని గుర్రబ్బండ్లు ఉండేవి. వాటిని గుర్రాలు లాక్కెళ్ళేవి. గుర్రాలకి గుగ్గుళ్ళు పెడుతున్నప్పుడు కొన్ని కిందపడేవి. పిచుకలు వాటిని తిని హాయిగా బతికేవి.

ఇప్పుడేమో అన్ని కార్లు, బస్సులు, మోటారు వాహనాలు. పిచుకలకు ఆహారం లభించడం కష్టమయిపోయి, నగరంలో వాటి సంఖ్య తగ్గిపోయింది.

పిచుక ఐస్‌క్రీం బండి లోకి చొరబడటాన్ని, గాజు పూలగుత్తి దొంగిలించిన కాకి చూసింది. పిచుకతో పోట్లాడింది. పిచుక కింద పడింది. ఇది చూసిన ఓ పోలీసు, పిచుకను తీసి తన జేబులో వేసుకున్నాడు.

సాయంత్రం మాషా, వాళ్ళ అమ్మతో ఉద్యానవనానికి వెళ్ళింది. పోలీస్, పిచుకను మాషాకి ఇచ్చాడు. మాషా పిచుకను ఇంటికి తీసుకొచ్చింది. దానికి స్నానం చేయించింది. తిండి తినిపించింది. నిద్రపుచ్చింది. మాషా ఆ పిచుక మంచి స్నేహితులయ్యారు. మాషా రుణం తీర్చుకోవాలని పిచుక నిర్ణయించుకుంది. విరిగిన దువ్వెన, అప్పడం తునక, కళావరు రాణి పేకముక్క, ఇలాంటివి మాషాకు పిచుక కానుకలుగా ఇచ్చేది. కాని మాషా వాటిని పక్కన పెట్టేసేది. ఇవన్నీ ఎందుకు మాషాకు నచ్చడంలేదో పిచుకకి తెలిసేది కాదు.

ఒకరోజు కాకి వద్ద ఉన్న గాజు పూలగుత్తిని చూసింది పిచుక.

అది మాషా వాళ్ళ అమ్మదని గ్రహించింది. ఆ నగరంలోని పిచుకలన్నింటిని కూడగట్టి, కాకిపై యుద్ధం ప్రకటించింది. కాకికి, పిచుక సైన్యానికి మధ్య భారీయుద్ధం జరిగింది. ఈ యుద్ధాన్ని నగర ప్రజలు ఆసక్తిగా చూశారు. చివరికి పిచుకలదే విజయం.

ఇదే సమయంలో మాషా వాళ్ళ అమ్మ, థియేటర్‌లో 'సిండ్రెల్లా' నాటక ప్రదర్శన ఇస్తోంది.

సిండ్రెల్లా బాధపడినప్పుడు ఏడుపు సంగీతం వస్తుంది. సిండ్రెల్లా సంతోషంతో ఉన్నపుడు ఆనందకరమైన సంగీతం వినిపిస్తుంది.

ఇంతలో హఠాత్తుగా థియేటర్ స్టేజ్ మీదకు ముక్కున గాజు పూలగుత్తిని కరుచుకుని ఓ చింపిరి పిచుక వచ్చింది. ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు.

సంగీతం నిలిచిపోయింది. హాలు అంతా నిశ్శబ్దం.

పిచుక తన ముక్కున ఉన్న గాజు పూలగుత్తిని 'సిండ్రెల్లా' పాత్రలో నటిస్తున్న మాషా వాళ్ళ అమ్మకు ఇచ్చింది. ఆమె ఆనందంతో దాన్ని తన గౌనుకు తగిలించుకుంది.

ఈ దృశ్యాన్ని చూసి మాషా ఎంతో ఆనందించింది.

చూశారా పిల్లలూ! మేలు మరువని పిచుక ఎంత మంచిపని చేసిందో!

★ ★ ★

English Title : The Ruffled Sparrow
Writer : Konstantin Paustovsky
English Translation : Fainna Glagoleva

కాన్‌స్టాంటిన్ పాస్తోవ్‌స్కీ(1892-1968):
ఇతని ఆత్మకథ ఎంతో ప్రాచుర్యం పొందింది. దానిలో మొదటి ప్రపంచయుద్ధం, రష్యన్ సివిల్‌వార్ పరిస్థితులను కవితాత్మకంగా చిత్రించాడు.

నీలం రాయి

అర్కాది గైదార్

అనగనగా ఒక ఊరిలో ఒక ముసలాయన ఉండేవాడు. అతను ఆపిల్ పండ్లతోటకు కాపలాగా ఉండేవాడు. ముఖంపై గాటుతో, చూడడానికి ఎప్పుడూ దిగులుగా కనిపించేవాడు.

అదే ఊరిలో ఇవాస్కా అనే తొమ్మిదేళ్ళ పిల్లవాడు ఉండేవాడు. ఒకరోజు ఇవాస్కా ఆపిల్ తోటలో దూరి, కొన్ని ఆపిల్ పండ్లు దొంగిలించి పారిపోతుంటే, అతని చొక్కా ముళ్ళ కంచెకు చిక్కుకుంది. పరిగెత్తలేక ముసలి కాపలాదారుడికి దొరికిపోయాడు.

ముసలాయన తనని తిడతాడు, కొడతాడు అనుకున్నాడు. కానీ ముసలాయన పల్లెత్తు మాట కూడా అనకుండా, ఇవాస్కాని వదిలేశాడు.

34B

పిల్లవాడు ఆశ్చర్యపోయాడు, తను చేసిన తప్పుకు సిగ్గుపడ్డాడు.

పిల్లవాడు ఇంటికి వెళ్లేదారిలో ఉన్న అడవిలో నడుస్తున్నాడు. నడిచి నడిచి అలసిపోయి ఒక బండపై కూర్చున్నాడు.

అది చాలా వేడిగా ఉంది.

తీరాచూస్తే అది నీలం రంగులో ఉంది.

దానిపై ఏవో అక్షరాలు చెక్కివున్నాయి. నీలం రాయిపై ఉన్న మట్టిని జాగ్రత్తగా తొలగించి, ఆ అక్షరాల్ని చదివాడు.

నీలంరాయిపై ఇలా రాసి ఉంది. "ఎవరైతే ఈ రాయిని కొండపైకి మోసుకెళ్లి, పగలకొడతారో వారికి తమ యవ్వనం లభిస్తుంది మరియు కొత్త జీవితం మొదలవుతుంది."

కనుక పిల్లవాడికి ఈ రాయి వల్ల సొంత ఉపయోగం కనిపించలేదు.

కానీ ఇవాస్కొ మంచి పిల్లవాడు. దయగల హృదయం కలవాడు. కనుక ఈ నీలం రాయి విషయాన్ని ముసలాయనకు చెప్పాడు. నీలం రాయిని కొండపైకి మోసుకు వెళ్ళడానికి ముసలాయన తిరస్కరించాడు.

కానీ ఇవాస్కొ బతిమిలాడాడు. రేపు సాయంత్రం కొండపైకి రాయిని తీసుకొస్తాను, మీరు పగలగొట్టాలని కోరాడు ఇవాస్కొ. ఎంతో చెప్పిన మీదట ముసలాయన తలూపాడు.

మర్నాడు సాయంత్రం పిల్లవాడు అతి కష్టంమీద నీలం రాయిని కొండపైకి మోసుకెళ్ళాడు. ముసలాయన చెప్పిన సమయానికి వచ్చాడు.

"రాయిని పగలకొడతారా?" అనడిగాడు పిల్లవాడు.

ముసలాయన ఇలా అన్నాడు. "నేను ఇప్పుడు ఉన్నట్టే ఆనందంగా ఉన్నాను. చూడడానికి ముసలివాడిలా కనిపించినా, నా మనసు ఎంతో ఆనందంగా ఉంది. నా మొహంపై ఉన్న గాటు నేను యుద్ధంలో పాల్గొన్నప్పుడు నాకు లభించిన బహుమానం. అది నా దేశభక్తికి నిదర్శనం."

ఇది విని పిల్లవాడు ఎంతో ఆశ్చర్యపోయాడు. ప్రస్తుతం మనం ఉన్న పరిస్థితి ఎటువంటిదైనా, దాన్ని ధైర్యంగా ఎదుర్కొని జీవించాలనే సత్యాన్ని ముసలివాని మాటల ద్వారా పిల్లవాడు గ్రహించాడు.

తర్వాత చాలామంది ఆ కొండపైన వున్న నీలంరాయిని చూశారు. కానీ ఎవ్వరూ దాన్ని పగలగొట్టలేదు.

పిల్లలూ! మీకు అలాంటి రాయి దొరికితే మీరేం చేస్తారు?

★ ★ ★

English Title : The Hot Stone.
Writer : Arkady Gaidar
English Translation : Jan Butler

అర్కాది గైదార్(1904-1941):

ప్రసిద్ధ రష్యన్ పిల్లల రచయిత. 'తిమోర్ అతని దళం', 'చుక్ గెక్ అన్నదమ్ముల కథ' వంటి బాలల్ని అలరించే రచనలు చేశారీయన.

మెరిసే సీతాకోకచిలుక

ఆంద్రి ప్లటోనొవ్

అనగనగా ఒక ఖండంలో నల్లసముద్రం ఉండేది. దాని ప్రక్కన పర్వతాలు ఉండేవి. అక్కడ అనీసియా అనే ముసలవ్వ జీవిస్తూ ఉండేది. ఆమె ఒంటరిగా ఉండేది. ఇంటి చుట్టు రోజా పూలతోటను పెంచుకొనేది.

ఉలియన్ అనే పొరుగింటి వ్యక్తి, ప్రతి సంవత్సరం ముసలవ్వ ఇంటికి వచ్చేవాడు. తేనె, ఇంటి సరుకులు మొదలయినవి తెచ్చేవాడు. ముసలవ్వ కళ్ళజోడు బాగుచేసేవాడు. కొన్నాళ్ళకు ఉలియన్ కూడా ముసలివాడై చనిపోయాడు.

తన వయసెంతో కూడా మర్చిపోయింది ముసలవ్వ. ఎలాగంటే, చిన్నప్పుడు ఇల్లు వదిలివెళ్లిన కొడుకు 'తెమోషా' కోసం ఎదురుచూస్తూ జీవితమంతా నిస్సారంగా

గడిపేసింది. ముసలితనం వచ్చేసినా కొడుకు కోసం ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూస్తూనే ఉంది.

అసలేం జరిగిందంటే..

తెమోషాకి సీతాకోకచిలుకలంటే బాగా ఇష్టం. ఓరోజు సీతాకోకచిలుకను పట్టుకొని తల్లి వద్దకు తెచ్చాడు.

"అమ్మా! ఇది ఎగరదా?" అని అడిగాడు.

"బాబూ! నువ్వు దాని రెక్కలని నలిపావు. పాపం! అది ఇక ఎగరలేదు. అలా సీతాకోకచిలుకలను పట్టుకోవద్దు. వాటిని స్వేచ్ఛగా ఎగరనివ్వు" అని మందలించింది.

కానీ, తెమోషా వినేవాడు కాదు.

వాళ్ళ ఇంటి చుట్టుపక్కల చిన్న కొండలు, పెద్ద కొండలు వరుసగా ఉండేవి. ఇంటి నుండి పెద్ద కొండల వరకు ఒంకరటింకరైన కాలిబాట ఉంది. పెద్ద కొండల తర్వాత కాలిబాట లేదు, ఎందుకంటే పెద్ద కొండలు పెరిగి పెరిగి ఆకాశంలో కలిసేవి.

ఒకరోజు తెమోషా, సీతాకోకచిలుకల కోసం కొండలలోకి వెళ్ళాడు.

తల్లి ఇలా పిలిచింది, "బాబూ! నీవు సీతాకోకచిలుకల ఆటలోపడి, ఈ అమ్మను మర్చిపోయావు. త్వరగా ఇంటికి రా!".

తల్లి మాటలు వినగానే "వస్తున్నానమ్మా!" అంటూ తెమోషా ఇంటికి చేరేవాడు.

కొన్ని నెలల తరువాత తెమోషా రోజూలానే సీతాకోకచిలుకల కోసం కొండలలోకి వెళ్ళాడు.

చీకటి పడింది. తెమోషా ఇంటికి బయలుదేరాడు. ఇంతలో బంగారు రంగులో మెరిసిపోయే పెద్ద సీతాకోకచిలుక కనిపించింది.

అది గద్దంత పెద్దది.



దానిని పట్టుకోవాలని చూశాడు తెమోషా. కానీ అది దొరకలేదు.

దాన్ని వెంబడిస్తూ, చిన్న కొండల్ని, పెద్ద కొండల్ని దాటేశాడు.

చివరకి ఆకాశం కనిపించింది.

ఆకాశంలో అందమైన నక్షత్రాలు కనిపించాయి.

తెమోషా నక్షత్రాన్ని పట్టుకోవాలని గాలిలో ఎగిరాడు. పొద్దున లేచేసరికి తెమోషా ఓ లోయలో పడ్డాడు. చుట్టూ ఎత్తయిన కొండలు. ఇంటికి వెళ్ళే దారే లేదు. ఎంతో ఏడ్చాడు. చివరికి అక్కడే బతకడం మొదలుపెట్టాడు. రోజూ కొండని పగలకొట్టేవాడు. అలా యాభై యేళ్ళపాటు కొండను పగలకొడుతూనే ఉన్నాడు. చివరికి సొరంగమార్గం నిర్మించాడు. అప్పటికే అతను ముసలివాడయ్యాడు.

చివరకి ఓ రోజు సొరంగం చివర తల్లి గొంతు వినిపించింది.

"అమ్మా!" అని అరిచాడు తెమోషా. సొరంగమార్గం చివరి బండని తొలగించి తల్లిని కలుసుకున్నాడు. తల్లి మొదట తెమోషాను గుర్తించలేదు. తరువాత ఆనందబాష్పాలతో కన్నీరు కార్చింది. కొడుకుని కౌగిలించుకుంది. కొడుకు చేతుల్లో హాయిగా కన్నుమూసింది.

★ ★ ★

English Title : The Gaudy Butterfly
Writer : Andrie Platonov
English Translation : James Riordan

ఆంద్రి ప్లటోనొవ్ (1899-1951):
ప్రసిద్ధ రష్యన్ రచయిత. 'ద ఫౌండేషన్ పిట్' ఇతని ప్రసిద్ధ నవల. ఇతని రచనలు సొంత దేశంలోనే నిషేధానికి గురయ్యాయి. ఇతనికి నివాళిగా '3620 ప్లటోనొవ్' అని ఓ చిన్న గ్రహానికి పేరు పెట్టారు.



స్నేహం కోసం

బోరిస్ జకోదర్

ఒకానొక సముద్రంలో ఒక చిన్న ఎండ్రకాయ నివసిస్తూ ఉండేది. ఆ సముద్రాన్ని అందరూ 'నీలి సముద్రం' అని పిలిచేవారు. కాని ఎండ్రకాయకు మాత్రం సముద్రమెప్పుడూ బూడిద రంగులోనే కనిపించేది. అందరూ నీలిసముద్రం అని ఎందుకు పిలుస్తున్నారో అర్థమయ్యేది కాదు. ఈ చిన్న ఎండ్రకాయకు కవచం ఉండేది కాదు.

"ఎలాగైనా ఓ కవచం సంపాదించుకో. అది నిన్ను కాపాడుతుంది" చెప్పింది మామ ఎండ్రకాయ.

మామ చెప్పినట్లు ఎండ్రకాయ కవచం కోసం ఎంతో ప్రయత్నించి చివరికి ఒకటి

సంపాదించింది. కాని తనకి సముద్రం బూడిదరంగులో కనిపిస్తుందని దిగులుగా ఉండేది. డాల్ఫిన్ వచ్చి "నీవు ఒంటరిగా వున్నావు కాబట్టి నీకు సముద్రం బూడిద రంగులో కనిపిస్తుంది. నిజమైన స్నేహితుడ్ని సంపాదించుకోగలిగితే, సముద్రం నీకూ నీలంగా కనిపిస్తుంది. అప్పుడు నీవు ఆనందంగా వుంటావు" అంది.

ఎండ్రకాయ స్నేహితునికోసం వేట మొదలెట్టింది. కొన్ని చేపలయితే ఎండ్రకాయని అసలు పట్టించుకోలేదు. కొన్ని సముద్రజీవులు ఎండ్రకాయని తినేయాలని చూశాయి. వెతికి వెతికి చివరికి నిరాశ చెందింది. ఎండ్రకాయకి ఇంతలో ఎవరో బాధతో పాట పాడుతున్నట్టు వినిపించింది. తిరిగిచూస్తే అందమైన ఎర్రటి సముద్రపు రోజా కనపడింది. ఎండ్రకాయ తనని పరిచయం చేసుకుని, ఎందుకు బాధగా వున్నావని అడిగింది.

రోజా ఇలా అంది, "నాకు సముద్రం బూడిదవర్ణంలో కనిపిస్తుంది. అది నీలంగా కనిపించాలంటే ఓ నిజమైన స్నేహితుడు కావాలి".

ఎండ్రకాయ కూడా తన కథంతా చెప్పింది. తర్వాత రోజాని తన వీపుపై ఎక్కించుకుంది. ఇద్దరూ కలిసి స్నేహితుల కోసం వెతకసాగారు.

'స్కార్‌లెట్ సిటీ' అనే సముద్రంలో స్నేహితులు దొరుకుతారని చెప్పింది రోజా. సరేనని అక్కడికి ప్రయాణం ప్రారంభించారు. రోజా, ఎండ్రకాయ వీపు మీద కూర్చుని సముద్రం అంతా చూస్తూ, కేరింతలు కొడుతూ ఆనందించింది. దారిలో వాళ్ళకి మామ ఎండ్రకాయ కనిపించింది.

స్కార్‌లెట్ సిటీకి వెళ్ళే దారిలో 'మిస్ట్రస్ సి' అనే ఆక్టోపస్ ఉంది. అది ఎన్నో ఎండ్రకాయల్ని తినేసింది, జాగ్రత్త అని చెప్పింది. స్కార్‌లెట్ సిటీ అనేది ఏడవ సముద్రం. ఆరు సముద్రాలు దాటిన తర్వాతే దాన్ని చేరుతామని చెప్పింది మామ ఎండ్రకాయ.

"సరే, ధన్యవాదాలు" అంది చిన్న ఎండ్రకాయ.

అలా ఎండ్రకాయ, రోజా ఆరు సముద్రాలూ దాటాయి.

దారిలో ఒకరి జీవితంలో సంగతులు మరొకరితో పంచుకున్నారు, నవ్వుకున్నారు,

తిట్టుకున్నారు, కొట్టుకున్నారు. అలా ప్రయాణించారు. చివరికి ఏడవ సముద్రంలోకి జాగ్రత్తగా ప్రవేశించారు.

'మిస్టస్ సి' ఆక్టోపస్ వీళ్ళను చూసింది. తన పొడవాటి తొండాలతో వీళ్ళను బంధించింది. రోజా తన నోటిని తెరచి వరసగా పదునైన బాణాలను సంధించింది. అవి గుచ్చుకొని ఆక్టోపస్ బాధతో విలవిలలాడుతూ, అక్కడ నుండి పారిపోయింది.

"నాకు ఏ స్నేహితుడు అక్కర్లేదు నువ్వు తప్ప" అన్న మాటలు ఎండ్రకాయ, రోజా నోటి నుండి ఒకేసారి ఊడిపడ్డాయి.

ఆ తర్వాత చూస్తే, అప్పుడు వాళ్ళకు సముద్రం అంతా నీలంగా కనిపించింది.

వాళ్ళు ఇప్పటికీ నిజమైన స్నేహితులుగా, కష్టసుఖాలు పంచుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు.

చిన్నారులూ! మీ నిజమైన స్నేహితులపేర్లు చెప్పండి.

★ ★ ★

English Title : The Hermit and the Rose
Writer : Boris Zakhoder
English Translation : James Riordan

బోరిస్ జకోదర్ (1918-2000):

రష్యన్ పిల్లల రచయిత, కవి. 'అలీస్ ఇన్ వండర్‌లాండ్'ని రష్యన్ భాషలోకి అనువదించాడు.

సుల్తాన్ మురాట్ పట్టణానికెళ్ళాడు

చింగీజ్ ఐత్‌మాతోవ్

అనగనగా ఒక ఊరిలో 'సుల్తాన్ మురాట్' అనే పిల్లవాడు ఉండేవాడు. అతను చాలా అల్లరి పిల్లవాడు. కాని రోజూ బుద్ధిగా బడికి వెళ్ళేవాడు. కొన్నాళ్ళకి వేసవి సెలవులు మొదలయ్యాయి.

ఓ రోజు సుల్తాన్ మురాట్ వాళ్ళ నాన్న "బాబూ! త్వరలో నేను పనుండి పట్టణానికి వెళ్తున్నాను, నీకు ఇష్టమైతే నిన్ను కూడా తీసుకువెళతాను" అన్నాడు.

"నాకు ఇష్టమే నాన్న" అన్నాడు పిల్లవాడు.

ఈ వార్త విని ఆనందంతో గంతులు వేశాడు పిల్లవాడు.

ఎందుకంటే తను పుట్టిపెరిగిన తరువాత ఇంతవరకు పట్టణం చూడలేదు మరి.

తన బడిలో కొంత మంది పిల్లలు అప్పటికే పట్టణాన్ని చూసి వున్నారు. వాళ్ళు ఆ విశేషాల్ని కథలు కథలుగా చెప్పేవాళ్ళు.

అప్పటి నుండి పిల్లవాడు అల్లరి చేయటం తగ్గించాడు. మొక్కలకు నీళ్ళుపోయడం, వాళ్ళ పెంపుడు గాడిదకు దాణా తినిపించటం, అమ్మకు సాయంచేయడం, చేసేవాడు. ఇది చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

"పిల్లవాడు ఇంత బుద్ధిమంతుడిలా ఎలా మారిపోయాడు?" అని.

వాళ్ళ ఇంట్లో ఉన్న పెంపుడు గాడిద పేరు 'బ్లాకీ'. అది చిన్నగా ఉన్నప్పుడు, దాన్ని సుల్తాన్ మురాట్ మేనమామ బహుమతిగా ఇచ్చాడు. బ్లాకీ బట్టలమూట మోయగలదు. కట్టెలమోపు మోయగలదు. ఇలా ఇంటిపనికి ఎంతో సహాయకారిగా వుండేది.

ఓ రోజు పిల్లవాడి నాన్న, బ్లాకీకి కళ్ళెం వెయ్యాలన్నాడు. పిల్లవాడు గాడిద మీద కూర్చుని దానికి కళ్ళెం వేయబోయాడు.

అది ఒడుపుగా పిల్లవాడిని కింద పడేసింది.

మళ్ళీ పిల్లవాడు కళ్ళెం వేయబోయాడు.

బ్లాకీ తెలివిగా తప్పించుకొంది.

పిల్లవాడు బ్లాకీకి కళ్ళెం వేయడానికి సర్కస్ ఫీట్లు చెయ్యాల్సివచ్చింది.

చివరికి నాన్న సాయం చేశాడు. బ్లాకీకున్న పెద్ద చెవుల్ని మెలితిప్పాడు నాన్న. అప్పుడది బుద్ధిగా సహకరించింది. మొత్తానికి పిల్లవాడు విజయవంతంగా బ్లాకీకి కళ్ళెం వేయగలిగాడు.

పిల్లవాడు పట్టణం వెళ్ళేరోజు కోసం ఎదురుచూస్తున్నాడు. రోజులు లెక్కపెట్టుకుంటూ గడిపాడు. రేపు ఉదయం పట్టణానికి ప్రయాణం అనగా, ముందురోజు రాత్రి పిల్లవాడికి నిద్రపట్టలేదు. ఆరుబయట నులక మంచంపై పడుకుని, ఆకాశంలో చందమామని చూస్తూ, చుక్కల్ని లెక్కపెట్టుకుంటూ గడిపాడు. చివరికి ఏ అర్ధరాత్రో నిద్రపట్టింది.

పొద్దుటే సుల్తాన్ మురాట్‌ను వాళ్ళ అమ్మ నిద్ర లేపింది.

"త్వరగా తయారవు బాబూ! పట్నం వెళ్ళే వేళయింది" అని తొందరచేసింది.

క్షణాల్లో తయారయ్యాడు పిల్లవాడు. చిరుతిళ్ళు ఓ సంచిలో పెట్టి మురాట్‌కు ఇచ్చింది వాళ్ళమ్మ. వాటిని తీసుకుని గుర్రంపై ఎక్కి, అమ్మకి 'టాటా' చెప్పి, నాన్నతోపాటు పట్టణానికి బయలుదేరాడు.

మొదటగా వాళ్ళ ఇల్లు, పొలం, ఊరు, ఆ తర్వాత స్టెపీ మైదానాలు దాటారు. దారిలో ఓ చోట ఆగి చిరుతిళ్ళు తిని, టీ తాగారు.

గుర్రాన్ని తోలే అవకాశం పిల్లవాడికొచ్చింది. గుర్రం తన కొత్త యజమానిని చూసి సకిలించింది. పిల్లవాడు ఒడుపుగా కళ్ళాన్ని పట్టుకుని గుర్రాన్ని అదిలించాడు.

అది మెల్లిగా నడక ప్రారంభించింది.

కొద్దిసేపటి తర్వాత నాన్న గుర్రాన్ని తోలటం ప్రారంభించాడు. దౌడు తీయించాడు.

అలా చాలాదూరం ప్రయాణించాక, పట్టణ శివార్లు మొదలయ్యాయి.

ఎత్తయిన భవంతులు, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు చూసి పిల్లవాడు ఆశ్చర్యపోయాడు. పట్టణంలో వాళ్ళు అందమైన బట్టలు ధరించి అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. పట్టణమంతా రణగొణధ్వనులతో నిండి వుంది.

ఆ రోజు పట్టణంలో జంతువుల సంత, అలాగే సర్కస్ జరుగుతున్నాయి. పిల్లవాడు తన అదృష్టాన్ని తానే నమ్మలేకపోయాడు. జీవితంలో మొదటిసారి పట్టణాన్ని చూడటానికి వచ్చాడు. ఆ రోజు జంతువులసంత, సర్కస్ జరగడం తన అదృష్టంగా భావించాడు.

మొదట టిక్కెట్టు కొనుక్కొని, అద్దాల హాలులోకి వెళ్ళాడు. ఎటుచూసినా అద్దాలే. తన ముక్కు పొడుగ్గా సాగినట్లు, తన కాళ్ళు ఎన్నో కాళ్ళుగా మారినట్టు, తన ముఖం ఎన్నో ముఖాలుగా కనిపించటం చూసి పిల్లవాడు ఆశ్చర్యపోయాడు, నవ్వుకున్నాడు, ఎంతో ఆనందించాడు.

సంతలోని జనాన్ని తప్పించుకుంటూ, వాళ్ళు జంతువులను చూడడం మొదలుపెట్టారు. ఏనుగులు, ఒంటెలు, ఎలుగుబంట్లు, కోతులు, రకరకాల పక్షులు

ఇలా ఎన్నో ఉన్నాయక్కడ. ఏనుగు చుట్టూ చేరి పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఏనుగు తెలివితేటల గురించి, మంచితనం గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

"ఓసారి ఏనుగు తన పెద్ద తొండంతో అమాంతం ఓ పిల్లవాడిని పైకి లేపి, పాము నుండి కాపాడిందట." ఇలా ఉన్నాయి ఆ కథలు. అవి విని మన పిల్లవాడు, వాళ్ళ నాన్న సంతోషించారు.

అప్పటికి పొద్దుగూకింది. నాన్న ఇంటికి కావలసిన సరుకులు, నూనె కొన్నాడు. నూనె డబ్బాలను గుర్రానికి అటు ఇటూ తగిలించాడు. సర్కస్‌లో చిరుతిళ్ళు కానిచ్చారు. ఇంటికి బయలుదేరారు. అలసిపోయిన పిల్లవాడు గుర్రంపై ప్రయాణిస్తూనే నిద్రలోకి జారాడు.

గుర్రం ఎత్తయిన ప్రదేశాల్ని దాటుతున్నపుడు ఉలిక్కిపడి నిద్రలేచేవాడు. వాళ్ళ నాన్నని గట్టిగా కౌగలించుకుని మరలా నిద్రపోయేవాడు. ఇంత మంచి నాన్నకు కొడుకుగా పుట్టినందుకు ఎంతో ఆనందపడ్డాడు పిల్లవాడు. చివరికి వాళ్ళు క్షేమంగా ఇల్లు చేరారు.

పిల్లలూ! మరి మీరు గ్రామాల్లో నివసిస్తూ ఉంటే మొదటిసారి పట్టణాన్ని ఎప్పుడు చూశారు?

జంతు ప్రదర్శనశాలల్ని, సర్కస్‌ని మొదటిసారి చూసినపుడు మీకేమనిపించిందో నాకు చెప్పండి!

★ ★ ★

English Title : Sultan Murat goes to town
Writer : Chinghiz Aitmatov
English Translation : James Riordan



చింగీజ్ ఐత్‌మాతొవ్ (1928-2008):
కిర్గిజ్ రచయిత. కిర్గిజిస్థాన్ మహాకవిగా ప్రసిద్ధం. ఇతను రచించిన 'జమీల్యా' నవల ప్రపంచ ప్రసిద్ధ ప్రేమగాథ. 'తల్లీ భూదేవి', 'తొలిఉపాధ్యాయుడు' వంటి నవలలు కూడా ఎంతో పేరు తెచ్చుకున్నాయి.

చిత్రం : ఎ. కెలేయ్‌నికోవ్

శీతాకాలపు కథ

రెవాజ్ ఇవానిష్‌విలి

అనగనగా ఓ అడవి సమీపాన ఉన్న ఒక ఊరిలో ముసలి దంపతులు నివసిస్తూ వుండేవారు. వారి కొడుకు పట్టణంలో ఉద్యోగం చేస్తుండేవాడు. ఆ దంపతులకి ఇద్దరు మునిమనుమలు ఉండేవారు.

వారి ఉద్యానవనంలో రకరకాల పూలచెట్లు, పండ్లచెట్లు ఉండేవి. వాళ్ళు బోల్డన్ని కోళ్ళని పెంచేవారు. ప్రతిరోజూ ఉదయం కోళ్ళకి గింజలు వేయడం, తోటపని చేసుకోవటం చేసేవారు. రాత్రుళ్ళు కోళ్ళను గంపల కిందపెట్టి భద్రంగా కాపాడేవారు.

అది వేసవి కాలం.

ఓ రోజు పోస్ట్‌మెన్ కార్డుముక్క తెచ్చిచ్చాడు. అందులో విషయమేమిటంటే, తన

కొడుకు కుటుంబం, మనవలతో కలిసి, త్వరలో ఆ ఊరు వస్తున్నారని. మునిమనవలు ప్రతి వేసవి సెలవుల్లో జేజయ్య, జేజమ్మ వద్ద ఆడుకుంటూ, కథలు వింటూ హాయిగా గడిపేవారు.

ప్రతిరోజు ముసలయ్య రైల్వేస్టేషన్‌కు వెళ్ళి ఎదురుచూసేవాడు. రెండు రోజుల తర్వాత కొడుకు, కోడలు, మునిమనుమలు వచ్చారు. ఎంతో సంతోషించారు ముసలి దంపతులు.

రాత్రి అన్నం తిన్న తరువాత కథలు చెప్పమని అడిగేవారు పిల్లలు. బోల్డన్ని రాజుల కథలు, మాయమంత్రాల కథలు, జానపద కథలు చెప్పేవాడు తాతయ్య. ఏదయినా నిజంగా జరిగిన కథ చెప్పమని అడిగారు పిల్లలు.

కథ చెప్పడం మొదలుపెట్టాడు తాతయ్య.

అది పోయిన సంవత్సరం శీతాకాలం.

ఊరంతా మంచు దుప్పటి కప్పుకుని వుంది.

ఓ రోజు హఠాత్తుగా ఓ కోడి మాయమైంది. ఎంత వెతికినా దొరకలేదు. తరువాత రోజు మరో కోడి మాయమైంది. ఇలా చాలా కోళ్ళు మాయమయ్యాయి. తీరా చూస్తే, కోళ్ళ గది వెనుక క్రింద భాగంలో ఓ గుంత కనిపించింది.

అది ఓ గుంటనక్క పనే అని అర్థమయ్యింది. దానికి గుణపాఠం చెప్పాలనుకున్నాడు తాత. ఇరుగు పొరుగు వారికి గుంటనక్క సంగతి, తమ కోళ్ళను కాజేసిన సంగతి చెప్పాడు తాత. వాళ్ళు రకరకాల సలహాలు ఇచ్చారు.

వాటిలో మొదటి సలహా, 'తుపాకితో నక్కను వేటాడటం.' కానీ, తాత ముసలివాడు, రాత్రంతా తుపాకి పట్టుకుని గురి చూస్తూ కూర్చోటం సాధ్యం కాదు. ఈ సలహా వల్ల ప్రయోజనం లేదు.

రెండవ సలహా, 'ఓ మేలుజాతి కుక్కను పెంచుకోవటం.' కానీ అది బుజ్జి కోడి పిల్లల్ని తినదన్న భరోసా ఏమీ లేదు. కాబట్టి ఈ సలహా కూడా తాతకి నచ్చలేదు.



48A

ఇక మూడవ సలహా, 'నక్కను బంధించటానికి ఓ మూడు ఉచ్చులను ఏర్పాటు చెయ్యటం.' ఈ సలహా బాగా నచ్చింది తాతకు.

నక్కను బంధించటానికి ఇరుగుపొరుగు వారి సాయంతో మూడు ఉచ్చులను ఏర్పాటు చేశారు. మొదటి ఉచ్చును కోళ్ళగూడు వెనకాల వున్న గుంత వద్ద ఏర్పాటుచేశాడు. రెండవ ఉచ్చును ఇంటి చుట్టూ ఉన్న, తెగిన ముళ్ళ కంచె వద్ద ఏర్పాటు చేశాడు. ఇక మూడవది ఇంటి నుండి అడవికి ప్రవేశించే దారి వద్ద ఏర్పాటు చేశాడు. మూడు ఉచ్చులు కనపడకుండా మంచుతో కప్పాడు.

రాత్రి చాలాసేపు మేలుకొని వున్నాడు తాత. గుంట నక్కను బంధించాలని, గట్టి పట్టుదలతో వున్నాడు. అర్ధరాత్రి తర్వాత, గట్టి కఱ్ఱనొకదాన్ని పట్టుకుని, ఉచ్చులను పరిశీలించడానికి బయలుదేరాడు.

మొదటి ఉచ్చు చూశాడు. ఖాళీగా ఉంది. రెండవ ఉచ్చు చూశాడు. అదీ ఖాళీగా ఉంది. ఇక మూడవ ఉచ్చు వద్దకు వెళ్ళాడు. గుంటనక్క ఆ ఉచ్చులో చిక్కుకుని ఉంది. మొదట ఇరుగు పొరుగు వాళ్ళని పిలుద్దామనుకున్నాడు తాత. కానీ వెంటనే తన మనసు మార్చుకున్నాడు.

"ఎలా ఉన్నావు?" అడిగాడు తాత.

జవాబివ్వలేదు నక్క.

"ఎందుకు నిశ్శబ్దంగా వున్నావు. నాతో మాట్లాడు. నీకు సిగ్గుగా లేదా? మా కోళ్ళను ఏం చేశావు?" గట్టిగా అడిగాడు తాత.

నక్క మౌనంగా సిగ్గుతో తలవంచుకుంది. "నా కళ్ళలోకి చూడు" అని నక్క కళ్ళలోకి సూటిగా చూశాడు తాత.

కానీ నక్క తాత కళ్ళలోకి సూటిగా చూడలేక తలదించుకుంది. తన దగ్గరున్న దుడ్డుకఱ్ఱతో నక్క తల మీద కొడదామనుకున్నాడు.

కాని తాత దయార్ద్ర హృదయుడు. హఠాత్తుగా ఏం చెయ్యాలో తాతకు అర్థమైంది.

తన చలికోటుని విప్పి, నక్కకు కప్పాడు. ఉచ్చులో నుంచి దాన్ని జాగ్రత్తగా విడిపించాడు. అది కృతజ్ఞతగా తాత కళ్ళలోకి చూసింది. దాని కళ్ళ నుండి రెండు కన్నీటి బొట్లు రాలాయి. మెల్లగా అడవిదారి పట్టింది నక్క.

"ఇది పిల్లలు, నా శీతాకాలపు కథ" అన్నాడు తాత.

మునిమనవళ్ళు తాతపై ముద్దుల వర్షం కురిపించారు.

★ ★ ★

English Title : A Winter tale
Writer : Revaz Inanishvili
English Translation : James Riordan



రెవాజ్ ఇవానిష్విలి (1926-1991):

జార్జియన్ రచయిత. అనేక నవలలు, కథలు, పిల్లల కథలు రాశారు. చాలా సినిమాలకు స్క్రీన్‌ప్లే అందించారు. 'ద వాండరింగ్ మ్యుజీషియన్' అన్న రచన ప్రసిద్ధం.

చిత్రం :
ఎన్. చరూషిన్

పిల్లవాడు - ఒంటె

కయ్యూం తంగ్రీకుల్‌యెవ్

అనగనగా ఒక ఊరిలో ఓ ముసలి ఒంటె నివసించేది.

దాని పేరు 'బేయర్'.

అది వయసులో వున్నప్పుడు ఎంతో కష్టపడి దాని యజమానికి సేవ చేసింది. ఇప్పుడది ముసలిదయింది. దాని యజమాని మంచివాడు. ముసలి ఒంటెకి రోజూ తిండిపెట్టేవాడు, కాని ఏ పని చెప్పేవాడు కాదు. దాని చివరిరోజులు ప్రశాంతంగా గడపాలని యజమాని ఆశ.

కానీ, ఖాళీగా ఉండడం ఒంటెకు ఇష్టం లేదు.

ఓ రోజు ఓ చిన్నపిల్లవాడు ఒంటె వద్దకు వచ్చి, దానికి రొట్టె ముక్క ఇచ్చాడు.

“నా పేరు మురాద్, నీ పేరు బేయర్ కదా?” అన్నాడు పిల్లవాడు.

తలూపింది ఒంటె.

ఇద్దరూ స్నేహితులయ్యారు.

పిల్లవాడు ఒంటె వద్దకు రోజూ వచ్చేవాడు. దాని కోసం తిండి తెచ్చేవాడు. ఇద్దరూ ఆడుకునేవారు. ఒంటె పిల్లవాడిని తన మూపురం మీద ఎక్కించుకుని తిప్పేది. అది తన మూపురం మీద వంటచెరకును తెచ్చేది. ఇలా పిల్లవాడికి సాయం చేసేది.

ఓ రోజు ఇలాగే పిల్లవాడు, ఒంటె కలప దుంగల కోసం దగ్గరిలోని అడవికి వెళ్ళారు.

ఆ రోజు చాలా వేడిగా ఉంది.

మిట్టమధ్యాహ్నం, పిల్లవాడికి దాహమేసింది. మంచినీటి సీసా ఇంట్లో మర్చిపోయాడు. కనుచూపు మేరలో ఓ నీటి కుంట కనిపించింది.

“పద బేయర్, దాహంగా ఉంది” అని అదిలించాడు పిల్లవాడు.

కానీ ఒంటె పిల్లవాడి చొక్కాను తన పళ్ళ మధ్య బలంగా బంధించింది. కదలక మెదలక అలాగే నిలబడిపోయింది. పిల్లవాడు విడిపించుకుని పరిగెట్టుకుంటూ నీటి కుంటవైపు వెళ్ళాడు. నీరు తాగుదామని కుంటలోకి దిగాడు.

హఠాత్తుగా కూరుకుపోసాగాడు.

అది నీటి కుంటలా కనిపించే ఊబి!

బంకమట్టితో ఉన్న ఊబి.

ఒంటె పరిగెడుతూ వచ్చి, పిల్లవాడి చొక్కాను తన పళ్ళమధ్య ఇరికించుకుని అతికష్టంమీద బలంగా పైకి లాగింది. క్షణాల్లో పిల్లవాడు క్షేమంగా బయటపడ్డాడు.

కానీ ఒంటె పిల్లవాడిని కాపాడుతున్న క్రమంలో ఊబిలో ఇరుక్కుంది. ఒంటెని

52A

బయటకు లాగడానికి పిల్లవాడు ప్రయత్నించాడు. కాని అతనికి శక్తి సరిపోలేదు.

పరిగెత్తుకుంటూ ఊరిలోకి వచ్చాడు.

"ఒంటెని కాపాడండి" "ఒంటెని కాపాడండి" అని అరుస్తున్నాడు.

కాని ఊరిలో జనాలు అప్పటికే పనులకు వెళ్ళిపోయారు. పాపం పిల్లవాడు దిగులుగా ఇంటికి చేరాడు.

వొళ్ళంతా బురదతో ఇంటి వద్ద 'బేయర్' ఒంటె వుంది.

ఒంటె బురదతో పోరాడి గెలిచింది. పిల్లవాడు ఒంటెని ఆనందంగా కౌగలించుకున్నాడు. వాళ్ళిప్పటికీ ప్రాణస్నేహితులే!

★ ★ ★

English Title : The Boy and the Camel
Writer : Kayum Tangrykuiev
English Translation : James Riordan



కయ్యుం తంగ్రీకుల్‌యెవ్ (1930-2014):
ప్రసిద్ధ రష్యన్ పిల్లల రచయిత, కవి. పిల్లల కోసం రెండువందల పైచిలుకు పుస్తకాలు రచించాడు. ఇతని పిల్లల కథలు ముప్పైకి పైగా ప్రపంచ భాషల్లోకి అనువదించబడ్డాయి. 'బంగారు గిన్నె' అన్న పిల్లల కథా సంపుటి ప్రసిద్ధం.

చెట్టు రహస్యం

లతీఫ్ ముఖ్ముదొవ్

అనగనగా ఒక ఊరిలో ఒక నది ప్రవహిస్తూ ఉండేది. దాని పక్కన మూడువందల సంవత్సరాల వయస్సు కలిగిన ఓ పెద్దచెట్టు ఉండేది. దూరం నుండి చూస్తే, అది విచ్చుకున్న పెద్ద గొడుగులా ఉండేది. ఆ చెట్టు తొర్రలో పాములు నివసిస్తూ ఉండేవని ఊరివాళ్ళు చెప్పుకునేవారు.

ఆ చెట్టు పక్కన మురాద్ అనే పిల్లవాడు నివసిస్తుండేవాడు. రహమత్ అనే పిల్లవాడు మురాద్ ఇంటి పక్కన ఉండేవాడు. మురాద్, రహమత్‌లు ప్రాణస్నేహితులు. రహమత్ అపరాధ పరిశోధన పుస్తకాలు అవీ బాగా చదువుతుండేవాడు. పెద్దయ్యాక అపరాధ పరిశోధకుడు అవ్వాలని కలలు కనేవాడు.

ఓ రోజు ఇద్దరు పిల్లలు అతి కష్టంమీద చెట్టు ఎక్కారు. దాని తొర్రలోకి తొంగిచూశారు. అది తేమగా, చీకటిగా ఉంది. ఊరి జనాలు చెప్పినట్టు అక్కడ ఏ పామూ లేదు. చివరికి పురుగులు కూడా లేవు.

ఆ చెట్టు కింద మట్టితో సహజంగా ఏర్పడిన మట్టిదిమ్మె ఉండేది. అది కూర్చోటానికి అనుకూలంగా ఉండేది. ఆ మట్టి దిమ్మె మురాద్ వాళ్ళ పూలతోట చుట్టూ ఉన్న మట్టి గోడకు ఆనుకొని ఉండేది.

సలీం అనే ముసలయ్య పొద్దున్నుండి రాత్రి వరకు ఆ మట్టిదిమ్మె మీద కూర్చుని, తన వీపుని చెట్టుబోదెకు ఆనించి, తీక్షణంగా ఓ పుస్తకం చదివేవాడు. అది పాత అరబిక్ కవిత్వ పుస్తకం. చాలాసేపు ఎదురుగా ప్రవహిస్తున్న నదిని చూస్తూ గడిపేవాడు. అప్పుడప్పుడూ తన ఫ్లాస్కులో నుండి తేనీరు, పింగాణీ పాత్రలో వంచుకుని తాగేవాడు. ఇది ప్రతిరోజు అతని దినచర్య.

పిల్లలకు వేసవి సెలవులిచ్చారు.

సలీం తాతయ్య అక్కడే కూర్చుని నిద్రపోయేవాడు. అప్పుడప్పుడు నదిలోని చేప పిల్లల్ని చూస్తూ గడిపేవాడు. అతని దినచర్య పిల్లలకి వింతగా అనిపించింది. ఇంట్లో మెత్తని పరుపు ఉండగా, చెట్టు క్రింద కూర్చుని ఎందుకు నిద్రపోతున్నాడో అర్థమయ్యేది కాదు.

"మురాద్! నా కళ్ళతో చూశాను. నిన్న సాయంత్రం నుండి ఈ రోజు పొద్దునదాకా సలీం తాత అలాగే చెట్టుకింద నిద్రపోతున్నాడు. నాకేదో అనుమానంగా ఉంది. ఆ చెట్టులో ఏదో రహస్యం దాగి ఉంది. ఆ రహస్యాన్ని కాపాడటానికే సలీం తాతయ్య రోజంతా ఆ చెట్టు వద్దే గడుపుతున్నాడు" అన్నాడు రహమత్.

"అవును. మా నాన్న కూడ అనేవాడు. ఆ చెట్టుకి ఎంతో చరిత్ర వుందని" అన్నాడు మురాద్.

"అయితే ఆ రహస్యం ఖచ్చితంగా మట్టి దిమ్మె కిందే దాగి వుంటుంది" అన్నాడు రహమత్.

"అయితే మనం ఆ రహస్యాన్ని ఎలాగయినా కనిపెట్టాలి" అన్నాడు మురాద్.

"ఆ రహస్యాన్ని కనిపెడితే, గొప్ప శాస్త్రవేత్తలుగా ఊరిలో, మన పాఠశాల్లో, దేశంలో ఎంతో పేరొస్తుంది" అన్నాడు రహమత్.

"కానీ ఎలా? సలీం తాతయ్య ఎప్పుడూ చెట్టు కింద నుండి కదలడుగా?" అన్నాడు మురాద్.

"మీ పూలతోట చివరి నుండి, చెట్టుకింద వున్న మట్టి దిమ్మె వరకు ఓ చిన్న సొరంగం తవ్వుదాం. ఏదన్నా విలువైన సంపద దొరకవచ్చు, చెట్టు రహస్యం తెలుసుకోవచ్చు. ఒకవేళ ఏమీ దొరకలేదనుకో, మనం తవ్విన దాన్ని తవ్వినట్టే పూడ్చేద్దాం" అన్నాడు రహమత్.

"భలే వుంది ఆలోచన, నేను సిద్ధం" అన్నాడు మురాద్.

తరువాతి రోజు ఉదయాన్నే పెద్దవాళ్ళంతా పనులకెళ్ళాక, పిల్లలిద్దరూ పలుగు, పార పట్టుకొని సొరంగం తవ్వటం మొదలుపెట్టారు. తవ్వే క్రమంలో వీళ్ళ ముఖాలు మట్టితో నల్లగా మారిపోయాయి.

ఒకరిని చూసి ఒకరు పడి పడి నవ్వుకున్నారు.

అలా ఓ ఐదు రోజులు, ఎలుకలు కలుగు తవ్వినట్లు, ఇద్దరు స్నేహితులూ చిన్న సొరంగం తవ్వారు.

మొదట్లో గట్టిమట్టి బయటకు వచ్చేది. తరువాత మెత్తటి బంకమట్టి వచ్చేది.

అయిదో రోజు ఉన్నట్టుండి గట్టిగా ఏదో తగిలింది.

తవ్వటం ఆపేశారు.

చెయ్యి పెట్టి బంకమట్టిని బయటకు తీశారు.

విరిగిన పింగాణీ పాత్ర, మేక ఎముక దొరికాయి.

పురావస్తు ఆవిష్కరణల వైపు గర్వంగా చూశారు. ఇంతలో రహమత్ ఆ

56A

సొరంగమార్గంలో ఇరుక్కుపోయాడు.

మురాద్, రహమత్ కాళ్ళను పట్టుకుని వెనక్కి లాగాడు. క్షేమంగా బయటపడ్డాడు రహమత్. పిల్లలిద్దరూ భారంగా ఊపిరి పీల్చుకున్నారు.

మురాద్ సొరంగంలోకి తొంగిచూశాడు. సలీం తాత చెట్టు కింద ఉన్నాడో లేదో అని.

వాళ్ళ అదృష్టం తాతయ్య అక్కడ లేదు.

మధ్యాన్న భోజనానికి ఇంటికి వెళ్ళినట్టున్నాడు. చెట్టు కింద వున్న మట్టిదిబ్బ పగిలిపోయి ఉండడం మురాద్ గమనించాడు. ఆ విషయాన్ని రహమత్‌తో చెప్పాడు. పిల్లలిద్దరూ మూడుగంటలు కష్టపడి సొరంగమార్గాన్ని మట్టితో పూడ్చేశారు. తవ్విన ఆనవాళ్ళు కనిపించకుండా దానిపై చెత్తా చెదారం పలచగా చల్లారు.

కొద్దిసేపటి తర్వాత సలీం తాతయ్య మెల్లగా నడుస్తూ చెట్టు వైపుకి వస్తున్నాడు. కర్ర సాయంతో నేలను చూస్తూ, పెద్ద చెట్టు వైపు నడుస్తున్నాడు.

కూలిపోయిన మట్టిదిమ్మెను చూసి ఆశ్చర్యపోయాడు. చేతితో మట్టిని తాకాడు. అలా కూలిన దిమ్మెను చూస్తూ కొద్దిసేపు మౌనంగా నిలబడ్డాడు. దిగులుగా ఇంటికి వెళ్ళిపోయాడు.

సలీం తాతయ్య కూర్చున్న మట్టిదిమ్మెను పాడుచేసినందుకు, పిల్లలిద్దరూ ఎంతో బాధపడ్డారు. తర్వాత రోజు తాతయ్యకు జ్వరం వచ్చింది. మురాద్, రహమత్ తల్లిదండ్రులు సలీం తాతయ్య బాగోగులు చూడ్డానికి వెళ్లారు.

పిల్లలు తమ తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకున్నారు. తమ వద్ద వున్న చిల్లర పైసలు జమచేసి, తాతయ్యకు ఇష్టమైన మిఠాయిలు కొన్నారు. తరువాత రోజు ఉదయం దాన్ని తీసుకుని బయలుదేరారు. దారిలో లారీ ఎదురొచ్చింది. దాంట్లో రహమత్ వాళ్ళ నాన్న, మురాద్ వాళ్ళ నాన్న వున్నారు.

“ఇంట్లో వుండక, రోడ్లమీద ఏం చేస్తున్నారు?” అని గద్దించారు తల్లిదండ్రులు.

తాతయ్య కోసం బహుమతి తీసుకెళ్తున్నామని చెప్పారు పిల్లలు. తల్లిదండ్రులు నవ్వి, పిల్లల్ని లారీలో ఎక్కించుకున్నారు. లారీలో ఏముందని అడిగారు పిల్లలు.

"సలీం తాతయ్య మట్టిదిమ్మె దురదృష్టవశాత్తూ కూలిపోయింది. తనకోసం చక్కటి దిమ్మెను కట్టబోతున్నాం" అన్నారు తల్లిదండ్రులు.

మురాద్ వాళ్ళ నాన్న రహమత్ వాళ్ళ నాన్నతో ఇలా అన్నాడు.

"ఆ చెప్తున్నాను గదా! ఆ రోజుల్లో మురాద్ చంటి పిల్లవాడు. భారీ వాన కురిసింది. నది పొంగింది. మురాద్ వాళ్ళ అమ్మ, మురాద్ ఆ నీటిలో కొట్టుకుపోతుంటే, సలీం తాతయ్య వాళ్ళ ఒక్కగానొక్క కొడుకు, నీటిలో దూకి ధైర్యంగా రక్షించాడు. కానీ, తను నీటిలోపడి చనిపోయాడు. ఆ యువకుడు మంచి కవి. చక్కటి అరబిక్ కవితల పుస్తకాన్ని కూడా ప్రచురించాడు.అప్పటి నుండి సలీం తాత, చివరికి కొడుకు జ్ఞాపకార్థంగా మిగిలిన ఆ ఒకే ఒక్క కవిత్వ పుస్తకాన్ని చదువుతూ, నదిని చూస్తూ, పెద్దచెట్టు కింద రోజంతా గడుపుతున్నాడు."

రహమత్ వాళ్ళ నాన్న ఇలా అన్నాడు,

"ప్రస్తుతం ఆ పుస్తకం కనిపించటం లేదు. తన కొడుకు చివరి జ్ఞాపకం కనిపించకపోవడంతో సలీం తాత జ్వరంతో మంచాన పడ్డాడు."

ఈ విషయాన్ని పిల్లలిద్దరూ విన్నారు. లారీ దిగాక, రహమత్ ఇలా అన్నాడు,

"మురాద్! మనం సొరంగం తవ్వటం వలన ఆ పుస్తకం మట్టిలో కూరుకుపోవచ్చు. మనకు దొరికిన పగిలిన పింగాణీ పాత్ర తాతది అయ్యిండొచ్చు."

ఇద్దరు పిల్లలు వెళ్ళి చెట్టు కింద వున్న మట్టి దిమ్మెను జాగ్రత్తగా తవ్వారు.

ఆశ్చర్యం!

కవితల పుస్తకం చెక్కుచెదరకుండా అక్కడే ఉంది.

దానిపై వున్న మట్టిని జాగ్రత్తగా దులిపారు.

సలీం తాతయ్య ఇంటికి వెళ్లి, ఆ పుస్తకాన్ని, తాత కోసం కొన్న మిఠాయిల్ని బహూకరించారు.

తాతయ్య ఎంతో సంతోషించాడు. దెబ్బకి తాతయ్యకి జ్వరం కూడా తగ్గిపోయింది.

ఆ తర్వాత కొన్నిరోజులకు పిల్లల తల్లిదండ్రులు ఇటుకలు, సిమెంటుతో చక్కటి దిమ్మెను కట్టారు.

ఎప్పటిలాగా సలీం తాతయ్య రోజంతా దిమ్మెమీద కూర్చుని, నదిని చూస్తూ, పుస్తకం చదువుతూ గడిపేవాడు. పిల్లలిద్దరూ అప్పుడప్పుడూ తాతయ్యను పలకరించేవారు.

ఇదండీ! చెట్టు వెనుక దాగిన 'రహస్యం.'

★ ★ ★

English Title : Secret of the Plane tree
Writer : Latif Makhmudov
English Translation : James Riordan

లతీఫ్ ముఖ్‌ముదొవ్ (1933-present):
ప్రసిద్ధ రష్యన్ పిల్లల రచయిత. 'హిల్ ఆఫ్ టులిప్స్' ఇతని ప్రసిద్ధ బాలకథా సంకలనం. కొన్ని సినిమాలకు దర్శకత్వం వహించాడు.



చిత్రం :
ఎం. మితురిచ్

బుజ్జి కుందేలూ ఇక సెలవ్

పావెల్ కొవల్యోవ్

అనగనగా ఒక ఊరిలో ఓ ముసలి తాతయ్య ఉండేవాడు. వేసవి సెలవులకు అతని మనవడు, మనవరాలు వచ్చారు.

వాళ్ళ ఇల్లు రహదారి ప్రక్కనే ఉంటుంది. రహదారి పైన ఎవరు వెళ్ళినా వాళ్ళకు కనిపిస్తారు.

ఓ రోజు ఒక వ్యక్తి బుజ్జి కుందేలును పట్టుకుని వాళ్ళ ఇంటి ముందు నుండి వెళ్తున్నాడు.

పిల్లలిద్దరూ ఆసక్తిగా అతని వద్దకు వెళ్ళి కుందేలును చూశారు.

60A

60B

అది తెల్లగా, బూడిద రంగు మచ్చలతో చాలా అందంగా ఉంది.

"కుందేలుని పెంచుకుంటారా పిల్లలూ?" అడిగాడా వ్యక్తి.

"ఓ తప్పకుండా!" అన్నారు పిల్లలు.

"దీని కాలికి గాయమయింది. కాబట్టి గాయం నయం అయేదాకా జాగ్రత్తగా చూసుకోండి" అని చెప్పాడా వ్యక్తి.

పిల్లలు కుందేలుని తీసుకుని తాతయ్య వద్దకొచ్చారు. తాతయ్య నవ్వుతూ బుజ్జి కుందేలును చంకన ఎత్తుకున్నాడు.

"ఈ బుజ్జి కుందేలుని ఎక్కడ పెడదాం తాతయ్యా" అని అడిగారు పిల్లలు.

"ఆలోచిద్దాం" అన్నాడు తాతయ్య.

పిల్లవాడు కొన్ని క్యాబేజి ఆకులు తెచ్చాడు.

కుందేలు కోసం. కాని అది తినలేదు. పాప కొన్ని తాజా పాలను తెచ్చింది. కాని అది పాలనూ తాగలేదు.

అది భయంతో వొణుకుతుంది.

తాతయ్య దాని తలను, పొడవైన చెవులను నిమిరాడు.

దాని తలను పాల గిన్నెలో ముంచాడు.

అది తన నాలుకతో మూతిని నాక్కుంది.

తరువాత మెల్లగా పాత్రలోని తాజా పాలను తాగింది.

బుజ్జి కుందేలును ఓ చెక్కపెట్టెలో పెట్టారు.

గాలి ఆడటం కోసం చెక్కపెట్టెకు కిటికీలు ఉంచారు.

ఓ వారం గడిచింది.

రోజూ కుందేలు తాజా పాలు తాగేది.

క్యాబేజీ ఆకులను, క్యారెట్ ముక్కలను ఇష్టంగా తినేది.

కుందేలు కాలి గాయం కూడా నయమయింది.

అది పిల్లలతో బాగా ఆడుకునేది.

మంచి స్నేహితులయ్యారు వాళ్ళు.

ఊర్లో పిల్లలందరూ దాన్ని చూడడానికి రోజూ వచ్చేవాళ్ళు.

చివరికి పిల్లలు దాన్ని పట్టణం తీసుకువెళతామన్నారు.

"మూగజీవుల్ని బంధించడం పాపం" అని తాతయ్య చెప్పాడు.

పిల్లలు ఆ బుజ్జి కుందేలును ఓ రోజు, అడవిలో వొదిలిపెట్టారు. అది ఆనందంగా గడ్డిలో గెంతుతూ మాయమయింది.

★ ★ ★

English Title : Good luck, Little Hare
Writer : Pavel Kovalyov
English Translation : James Riordan

పావెల్ కొవెల్యొవ్:

రష్యన్ పిల్లల రచయిత. 'ద వోల్డ్ పాల్' లాంటి ఎన్నో పిల్లల కథల్ని రాశారు.



గుర్రపు స్వారీ

డుకెన్‌బొయ్ డొజ్‌హనొవ్

అనగనగా ఒక ఊరిలో 'దలబి' అనే పిల్లవాడు ఉండేవాడు. వాళ్ళ నాన్న పందెం గుర్రాలు స్వారీ చెయ్యడంలో బాగా పేరు గడించాడు. అతను, కొడుకుకి కూడా గుర్రపు స్వారీ నేర్పించాడు.

ఆరేళ్ళ వయసు నుండీ గుర్రపు స్వారీ పోటీల్లో పాల్గొనేవాడు దలబి. ఎన్నో బహుమతులు సాధించాడు. వాళ్ళ ఊరికి పేరు తెచ్చాడు. ప్రస్తుతం వాళ్ళకున్న పందెం గుర్రం పేరు 'కెర్‌కిక్.'

పిల్లవాడికి తెలిసిన గుర్రపు పందాలు రెండు రకాలు.

మొదటిది 'గుండ్రటి పందెం'.

ఈ పందెం నిర్ణీత ప్రదేశంలో జరుగుతుంది. కొన్ని కిలోమీటర్ల గుండ్రటి వృత్తం మీద జరుగుతుంది. కాబట్టి గుర్రాల్ని, గుర్రపు రౌతులని, ప్రేక్షకులు ఆట మొత్తం చూడగలరు.

రెండవది 'సరాసరి పందెం'.

దీనిలో పందెం గుర్రాలు ఒకే దిశలో ప్రయాణించాలి. పందెం ప్రారంభంలో జెండా వూపినపుడు ప్రేక్షకులు గుర్రాలను చూస్తారు. పందెం చివరలో మొదట వచ్చిన, గెలిచిన గుర్రాన్ని ప్రేక్షకులు చూస్తారు. పందెం మధ్యలో జరిగేదాన్ని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదు.

ఆ రోజు జరుగుతున్న రేసు 'గుండ్రటి పందెం.' ఒక విడత ఆరు కిలోమీటర్లు ప్రయాణించాలి. అలా ఆరు విడతలు ప్రయాణించిన మీదట ముప్పైయవ కిలోమీటరుకు ఏ పందెం గుర్రం చేరుకుంటుందో అది, దాన్ని స్వారీచేసిన గుర్రపు రౌతు విజేతలవుతారు.

జెండా వూపారు.

పందెం ప్రారంభమైంది.

మన పిల్లవాడి గుర్రాన్ని ముందురోజు రాత్రే వాళ్ళ నాన్న సిద్ధం చేశాడు. దానికి స్నానం చేయించి, మెత్తటి నూలు బట్టతో ఒళ్ళంతా తుడిచాడు. గుగ్గిళ్ళు, ఉలవలు తినిపించాడు. నీరు తాగించాడు. ప్రేమగా నిమిరాడు. అందమైన గట్టి కళ్ళాన్ని తగిలించాడు.

జెండా ఊపగానే, దుమ్ము గాల్లోకి లేచింది.

గుర్రాలన్నీ ఒక్కసారిగా దౌడుతీశాయి.

ఈ పందెంలో మొత్తం పది గుర్రాలు పాల్గొన్నాయి. మిగిలిన తొమ్మిదిని, ఇరవై అయిదు సంవత్సరాల వయసున్న గుర్రపురౌతులు స్వారీ చేస్తున్నారు. ఈ చిన్న పిల్లవాడి వయసు కేవలం పది సంవత్సరాలు. అయితేనేం మనవాడు 'అద్భుతమైన గుర్రంరౌతు'. గుర్రం కూడా మేలుజాతి గుర్రం.

మొదటి విడతలో అందరికంటే పిల్లవాడు ఆధిక్యం సాధించాడు.



రెండవ విడతలో కూడా పిల్లవాడిదే ప్రథమస్థానం.

కానీ మూడవ విడతలో గుర్రం కళ్ళెం కొంచెం ఊడింది.

పిల్లవాడు తన పళ్ళతో కళ్ళాన్ని పట్టుకొని, దాన్ని చేత్తో సరిచేశాడు. ఈ కొద్ది సమయంలో ప్రత్యర్థి నల్లగుర్రం వేగంగా దూసుకొని వెళ్ళి మూడవ విడతలో ఆధిక్యం సాధించింది.

నాలుగవ విడతలో మళ్లీ పిల్లవాడి గుర్రందే పైచేయి.

చివరిదైన ఐదవ విడత ప్రారంభమయింది.

ప్రత్యర్థి నల్ల గుర్రం కూడా పోటాపోటీగా పరిగెడుతోంది. కానీ మన చిన్న పిల్లవాడు, తన గుర్రాన్ని దౌడు తీయించాడు.

అది వాయువేగంతో పరిగెత్తి ప్రథమస్థానంలో నిలిచింది. ప్రజలు జయజయ ధ్వానాలు చేశారు.

పిల్లవాడి నాన్న, పిల్లవాణ్ణి కౌగిలించుకుని, “మన వంశం పరువు నిలబెట్టావు” అన్నాడు. పిల్లవాడు ప్రేమగా తన తండ్రిని, గుర్రాన్నీ కౌగిలించుకున్నాడు.

★ ★ ★

English Title : The Little Jockey
Writer : Dukenbai Doszhanov
English Translation : Janet Butler

డుకెన్‌బాయ్ డొజ్‌హనోవ్:
రష్యన్ పిల్లల రచయిత. ఎన్నో పిల్లల కథలు రాశారు.



మాయా ఉంగరం

కాన్‌స్టాంటిన్ పౌస్తొవ్‌స్కీ

అనగనగా ఒక ఊరిలో ఒక చిన్న పాప వాళ్ళ తాతయ్యతో కలిసి నివసిస్తుండేది.

అది శీతాకాలం.

వాళ్ళ తాతయ్య జబ్బు పడ్డాడు. అతనికి పొగతాగే అలవాటుంది.

తాతయ్య పొగాకు కోసం, పాప బయటకొచ్చింది.

వాళ్ళ ఇంటి పక్కన ఒక రైల్వే స్టేషన్ ఉంది.

దానికి అవతల పొగాకు అమ్మే దుకాణం వుంది. అక్కడకు వెళ్ళింది పాప.

పొగాకు కొని ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు రైల్వేస్టేషన్‌లో సైనికులు కనపడ్డారు.

"పాప, ఏంటి నీ చేతుల్లో ఉన్నది" అడిగాడు ఓ సైనికుడు.

"మా తాతయ్య కోసం పొగాకు తీసుకెళ్తున్నాను" అంది పాప.

"నాకు కొంచెం అమ్ముతావా?" అన్నాడు సైనికుడు.

"లేదు" అంది పాప.

చిన్నబోయాడు సైనికుడు.

"కొంచెం ఊరికినే ఇస్తాను" అని ఆ సైనికుడికి కొంచెం పొగాకు ఇచ్చింది.

ఎంతో ఆనందించిన సైనికుడు పాపకి బహుమతిగా ఓ 'మాయా ఉంగరం' ఇచ్చాడు.

"ఇది అద్భుతమైన ఉంగరం. ఈ ఉంగరాన్ని మధ్యవేలుకు పెట్టుకుంటే, నీవు మీ తాతయ్య ఆరోగ్యంగా ఉంటారు. ఈ ఉంగరాన్ని చూపుడువేలుకి పెట్టుకుంటే, నీవు చాలా ఆనందంగా ఉంటావు" అన్నాడు సైనికుడు.

ఆ సైనికుడికి మంత్రవిద్యలు తెలుసు.

పాప ఆనందంతో మాయా ఉంగరాన్ని తీసుకుని సైనికునికి కృతజ్ఞతలు చెప్పింది. దారిలో వెళ్తూ ఆ మాయా ఉంగరాన్ని చిటికెన వేలుకు పెట్టుకుంది. పాప చిటికిన వేలు బాగా చిన్నది. ఉంగరం కొంచెం పెద్దది. కాబట్టి అది జారి మంచులో పడిపోయింది. ఎంత వెతికినా దొరకలేదు.

ఏడుస్తూ ఇంటికి పోయి, జరిగిన కథంతా వాళ్ళ తాతకు చెప్పింది. తాతకు పొగాకు ఇచ్చింది.

"బాధపడకు, మన ఉడుత నీకు సాయం చేస్తుందేమో అడుగు" అని సలహా ఇచ్చాడు తాతయ్య.

పాప ఉడుతని సాయమడిగింది. ఉడుత ముందు కొంచెం బెట్టుచేసింది. చివరికి ఒప్పుకుంది. ఉడుత, పాప కలిసి రోజూ ఆ ఉంగరం కోసం వెతికేవాళ్ళు. చివరికి ఓ

రోజు మాయా ఉంగరం పాపకు దొరికింది. పాప ఆనందానికి అవధుల్లేవు. ఉడుతకు కృతజ్ఞతలు చెప్పింది.

మాయా ఉంగరాన్ని మధ్య వేలుకు ధరించింది. ఇంటికొచ్చి చూసేసరికి తాతయ్య ఆరోగ్యంగా అటూ ఇటూ తిరుగుతున్నాడు.

"చిన్నారీ! నీవు బయటకు వెళ్తూ తలుపు మూయలేదు.

తాజా గాలి గదిలోకి వచ్చింది, నా జబ్బు నయం చేసింది" అన్నాడు తాతయ్య.

ఉంగరం విశేషం చెప్పింది పాప. తాతయ్య వంట చెరకు నరకడం లాంటి పనుల్లో పడ్డాడు. వంట చేయడానికి పాప, తాతయ్యకు సాయంచేసేది.

తరువాతి రోజు పాప మాయా ఉంగరాన్ని తన చూపుడువేలుకు పెట్టుకుంది.

వాళ్ళ ఇంటిపక్కనున్న అడవి ఎంతో ప్రకాశవంతంగా వెలిగింది. చెట్లు పువ్వులు పూశాయి. పండ్లను కాశాయి. నీలి ఆకాశం ఎంతో అందంగా మెరిసింది. సూర్యుడు, మబ్బుల వెనక నుంచి తీవిగా బయటకు వచ్చాడు.

ఈ దృశ్యాలను చూసి పాప, తాతయ్య, ఉడుత ఆనందంతో నృత్యం చేశారు.

వాళ్ళు ఈ రోజుకీ ఆనందంగానే ఉన్నారు.

★ ★ ★

English Title : The Little Steel Ring
Writer : Konstantin Postovsky
English Translation : James Riordan



కాన్‌స్టాంటిన్ పాస్తోవ్‌స్కీ (1892-1968):
ఇతని ఆత్మకథ ఎంతో ప్రాచుర్యం పొందింది. దానిలో మొదటి ప్రపంచయుద్ధం, రష్యన్ సివిల్‌వార్ పరిస్థితులను కవితాత్మకంగా చిత్రించాడు.



చిత్రం : నికొలాయ్ కొచెర్‌గిన్

ఇసుక తుఫాను

కయ్యుం తంగ్రీకుల్‌యెవ్

అనగనగా ఒక ఊరిలో ఓ ముసలి గొర్రెల కాపరి ఉండేవాడు. అతనికి విశ్వాసపాత్రురాలైన కుక్క ఉండేది. దాని పేరు 'అక్‌బాయ్'. అది గొర్రెల మందను కాపలా కాసేది.

ముసలి గొర్రెల కాపరి వద్ద ఓ తుపాకీ వుండేది. దాంతో తోడేళ్ళను వేటాడి, తన గొర్రెలను కాపాడుకొనేవాడు.

ఓ రోజు గొర్రెలను మేపడానికి 'రెండు పాప్లార్'లు అనే పేరున్న ఓ ఇసుక మైదానానికి వెళ్ళాడు ముసలయ్య. తన కుక్కను కూడా వెంట తీసుకుపోయాడు. గొర్రెలు ఇసుక మైదానంలో గడ్డి మేస్తున్నాయి. తాతయ్య, కుక్క వీపు నిమురుతూ గొర్రెలమందకు కాపలా

కాస్తున్నాడు. ఇంతలో సాయంత్రమైంది. ఉన్నట్టుండి ఇసుక తుఫాను మొదలయ్యింది. దుమ్ము పెద్ద ఎత్తున గాల్లోకి లేచింది. గొర్రెలమంద బెదిరింది. దాన్ని కాపాడడానికి ముసలయ్య, కుక్క ప్రయత్నించారు. కానీ దుమ్ము తాకిడి ఎక్కువగా ఉండడంవల్ల ఒకరికి ఇంకొకరు కనిపించలేదు.

తెల్లవారింది. ఇసుక దిబ్బలోంచి మెల్లగా పైకి లేచాడు ముసలయ్య.

కుక్క కనపడటం లేదు. గొర్రెలమందా మాయమయ్యింది. ఆ పక్కనే తెగిన చిన్నగంట కనిపించింది. అది గొర్రెల నాయకుడు అయిన పెద్ద గొర్రె మెడలోని చిన్నగంట. ఆ గంట తెగిందంటే పెద్ద ప్రమాదం జరిగినట్టే. ఇక గొర్రెల జాడ కనిపెట్టడం చాలా కష్టం.

ముసలయ్య పరిగెత్తుకొంటూ వెళ్ళి, జరిగింది చెప్పి, ఇరుగు పొరుగు వారిని తోడు తీసుకుని గొర్రెలమందను వెతకటానికి బయలుదేరాడు. అలా వాళ్ళు రెండువందల కిలోమీటర్లు పోయిన తరువాత పాతబడిన ఎండిపోయిన బావిలో గొర్రెల మంద కనిపించింది. వాటికి కుక్క కాపలా కాస్తోంది. అది యజమాని పట్ల విశ్వాసంతో నాలుగు రోజులు తిండి, నీరూ లేకున్నా గొర్రెలమందను కాపలా కాసింది. విశ్వాసం అంటే అది. ముసలయ్య గొర్రెలను లెక్కపెట్టాడు. అన్ని గొర్రెలు ఉన్నాయి. ముసలి గొర్రెలకాపరి తన కుక్కను కౌగిలించుకున్నాడు.

★ ★ ★

English Title : The Sand Storm
Writer : Kayum Tangrykuiev
English Translation : James Riordan



కయ్యుం తంగ్రీకుల్‌యెవ్ (1930-2014):
ప్రసిద్ధ రష్యన్ పిల్లల రచయిత, కవి. ఇతను పిల్లల కోసం రెండువందల పైచిలుకు పుస్తకాలు రాశాడు. ఇతను రాసిన ముప్ఫయికి పైగా పిల్లల కథలు ప్రపంచ భాషల్లోకి అనువదింప బడ్డాయి. 'బంగారు గిన్నె' అన్న పిల్లల కథా సంపుటి ప్రసిద్ధం.

70B

చిత్రం : ఇ. మెష్కోవ్

బుల్ ఫైటర్స్

సెవ్‌లొడ్ నెస్తాయ్‌కో

అనగనగా ఒక ఊరిలో జావా, పావ్‌లిక్ అనే ఇద్దరు పిల్లలు ఉండేవారు. వారిద్దరూ ప్రాణస్నేహితులు. వాళ్ళ గ్రామం పేరు 'వాసుకోవ్కా.' ఏదైనా చేసి చిన్న వయసులోనే పేరు ప్రఖ్యాతులు సంపాదించాలని వాళ్ళ ఆశ, ఆశయం.

ఓ రోజు జావా, పావ్‌లిక్ ఇద్దరూ ఒక సొరంగం తొవ్వుదామనుకున్నారు. పావ్‌లిక్ వాళ్ళ మామయ్య పందుల కొట్టం కింద తవ్వుతుండగా ఓ పెద్ద పంది ఆ సొరంగంలో తలపెట్టి విదిలించింది. అది 'ధాం' అని సొరంగంలో పడి ఇరుక్కుపోయింది.

'బ్రేవ్'.. 'బ్రేవ్' అని అరుస్తూంది పంది.

దాని అరుపులు విని పావ్‌లిక్ వాళ్ళ మామయ్య వచ్చాడు. పిల్లలు పారిపోతున్నారు.

రావడం రావడమే తిట్ల వర్షం కురిపించాడు.

ఒకవేళ పిల్లల మొదటి పథకం విజయవంతమైతే, వాళ్ళు ఈ సొరంగమార్గాన్ని చూడటానికి, దానిలో ప్రయాణించడానికి రుసుము పెడదామనుకున్నారు. 'వాసుకోవ్కా' గ్రామం ప్రజలకు మూడు రూపాయలు, వాళ్ళ బంధువులకయితే ఉచిత ప్రవేశం, వాళ్ళ లెక్కల టీచర్‌కు మాత్రం ఐదు రూపాయల రుసుము పెడదామని నిర్ణయించుకున్నారు. కానీ వాళ్ళ మొదటి పథకమే బెడిసికొట్టింది.

మరి ఎలా పేరు ప్రఖ్యాతులు సంపాదించాలి? అని ఇద్దరు స్నేహితులూ తెగ ఆలోచిస్తున్నారు.

ఈలోగా వాళ్ళ గ్రామంలోకి వచ్చిన 'బుల్ ఫైటర్' అనే సినిమా చూశారు.

అందులో హీరో ఎద్దుతో పోరాడి గెలుస్తాడు. ఈ ఆలోచన నచ్చింది వాళ్ళకు.

గ్రామంలో ఉన్న ఒకే ఒక ఎద్దుతో పోరాడదామనుకున్నారు. ఆ ఎద్దు చాలా పొగరుబోతు. పదునైన కొమ్ములతో పెద్దవాళ్ళను కూడా పొడుస్తుంది. కాబట్టి ఎద్దుతో పోరాడటం అన్న ఆలోచనకు స్వస్తి చెప్పారు.

వాళ్ళ ఆలోచన ఏంటంటే, ఎద్దుతో పోరాడి గెలిస్తే, 'వాసుకోవ్కా' గ్రామ ప్రజలు వాళ్ళని జానపద వీరుల్లా చూస్తారు. వాళ్ళ గొప్పతనం గురించి రేడియో, టీవీ ద్వారా వేరే గ్రామంలో ఉన్న వాళ్ళ బంధువులకు కూడా తెలుస్తుంది అని!

మేకతో పోరాడదామనుకున్నారు. చిల్లరగా ఉంటుందని మానుకున్నారు. చివరికి ఆవుతో పోరాడదామనుకున్నారు. పావలిక్ వాళ్ళ ఆవుకు ఒక కొమ్ము ఉంది. రెండో కొమ్ము ఎప్పుడో విరిగిపోయింది. కాబట్టి అది 'బుల్‌ఫైట్'కి పనికిరాదని తేల్చారు.

జావా, వాళ్ళ ఆవుని కొలను పక్కనున్న పచ్చిక మైదానానికి తోలుకొని వచ్చాడు. జావా, పావ్‌లిక్ 'బుల్‌ఫైట్' మొదలుపెడదామనుకున్నారు. ఇది ముందస్తు ప్రయత్నం మాత్రమే అనుకున్నారు. జావా ఎర్రటి గుడ్డని, ఆవు కళ్ళ ముందు రెండుసార్లు ఊపాడు.

దాని వీపు మీద గట్టిగా చరిచాడు.



72A

అది తన తోకతో ఈగలు తోలుకుంటూ, ప్రశాంతంగా గడ్డిని మేస్తుంది. దాన్ని ఎంత రెచ్చగొట్టినా అది ప్రశాంతంగానే ఉంది. చివరికి జావాకి సహనం నశించింది. కర్రతో దానిని బాదాడు.

ఆవు కోపంతో, జావాను ఎత్తి, పక్కనున్న బురద కొలనులో పడేసింది. పావ్‌లిక్ కూడా దెబ్బకు జడిసి బురద కొలనులోకి దూకాడు. వాళ్ళిప్పుడు మట్టికొట్టుకుపోయిన బట్టలతో బురదలో తిరిగే పందిపిల్లల్లా ఉన్నారు.

తరువాత ఆవు ఇంటికి వెళ్ళిపోయింది.

పిల్లలకు బుద్ధి వచ్చింది.

ఆ రోజు నుండి జావా కానీ, పావ్‌లిక్ కానీ ఆవుని ఎప్పుడూ కొట్టలేదు. జావావాళ్ళ అమ్మ ఇచ్చిన తినుబండారాల్ని, ఆవుకు కూడా పెట్టేవాళ్ళు. ఆవు, జావా, పావ్‌లిక్‌లు ఇప్పుడు మంచి స్నేహితులు.

ఇదండీ మన 'బుల్‌ఫైటర్స్' కథ.

★ ★ ★

English Title : Two Toreandors from Vasukovka Village
Writer : Vsevolod Nestaiko
English Translation : James Riordan



సెవ్‌లోడ్ నెస్తాయ్‌కో (1930-2014):
ప్రముఖ ఉక్రేనియన్ పిల్లల రచయిత. 'రెయిన్‌బో' అన్న పిల్లల పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. ఇతను పిల్లల కోసం రాసిన ఇరవైకి పైగా పుస్తకాలు ప్రపంచవ్యాప్తంగా అనేక భాషల్లోకి అనువాదం అయ్యాయి.

మంచు బిందువులు

స్పిరిడాన్ వెంగిలి

అనగనగా ఒక ఊరిలో 'గుగుడ్జె' అనే చిన్న పిల్లవాడు ఉండేవాడు. అతని జేబులో ఏడు రూపాయి బిళ్ళలున్నాయి.

వాటిని లెక్కపెట్టాడు.

ఎన్ని సార్లు లెక్కపెట్టినా ఏడు రూపాయలే వస్తున్నాయి.

మూడు రోజుల తరువాత లెక్కపెట్టాడు.

కానీ జేబులో డబ్బులు ఏ మాత్రం పెరగలేదు.

వాళ్ళ ఊరిలో ఓ రోజు 'బహుమతుల పండుగ' వచ్చింది.

74B

ఆ రోజు ఒకరికి మరొకరు ప్రేమతో బహుమతులు ఇచ్చి పుచ్చుకుంటారు.

వాళ్ళ అమ్మకి, గుగుడ్సె కారు బహుమతిగా ఇద్దామనుకున్నాడు.

దుకాణంలోని కారు చాలా చిన్నగా ఉంది.

దాంట్లో గుగుడ్సెనే సరిపోడు, ఇక వాళ్ళమ్మ ఏం సరిపోతుంది.

నాలుగు రూపాయలు ఇచ్చి 'అందమైన గుండీ' కొన్నాడు. ఆ గుండీ కోసం నీలం గౌను కొందామనుకున్నాడు. కానీ దురదృష్టవశాత్తు ఆ దుకాణంలో నీలం గౌను లేదు.

ఇంకో దుకాణంలో మంచి చెప్పులు చూశాడు.

వాటి ధర ఎంతో అడుగుదామనుకున్నాడు.

కాని వాళ్ళ అమ్మ పాదం కొలత గుగుడ్సెకు తెలియదు.

ఇంటికి వెళ్ళాడు. రాత్రి అయ్యేవరకు ఎదురుచూశాడు.

వాళ్ళ అమ్మకు అద్భుతమైన జానపద కథ చెప్పాడు. ఆమె నిద్రలోకి జారుకుంది.

మెల్లగా ఓ దారంతో వాళ్ళ అమ్మ పాదాన్ని కొలిచాడు.

ఆ దారాన్ని దిండు కింద దాచిపెట్టి నిద్రపోయాడు.

తర్వాతి రోజు దుకాణానికి వెళ్ళేడు, అక్కడ ఉన్న చెప్పులన్నింటిని దారంతో కొలిచాడు. వాటిలో మంచి చెప్పుల జతను ఎంచుకున్నాడు. దానిపై ధర చూశాడు. చాలా ఎక్కువగా ఉంది. కానీ జేబులో మూడు రూపాయలే ఉన్నాయి.

ఇంటిదారి పట్టాడు.

వెళ్ళేదారిలో ఉన్న కొండపైన కొన్ని మంచుబిందువులను ఏరుకున్నాడు.

ఆ మంచుబిందువులను తీసుకుని దుకాణానికి వెళ్ళాడు.

దుకాణంలో మూడురూపాయలు, మంచుబిందువులు ఇచ్చాడు.

దుకాణంలో ఉన్న అమ్మాయి ఇది చూసి ఆశ్చర్యపోయింది.

ఆ సంవత్సరంలో అవి తొలి మంచుబిందువులు.

ప్రజలంతా గుగుద్సేని పొగిడారు, కానీ గుగుద్సే వాళ్ళ అమ్మకు బహుమతి కొనలేకపోయాడు.

"ఫర్లేదు రేపు ఇంకొన్ని మంచుబిందువులను ఏరుకొస్తాను" అనుకున్నాడు పిల్లవాడు.

ఆ రోజు రాత్రి మంచువర్షం కురిసింది.

ఆ ప్రాంతమంతా మంచుబిందువులతో నిండిపోయింది.

కిటికీని ఆనుకుని గాఢనిద్రలో ఉన్న పిల్లవాడిని వాళ్ళ అమ్మ నిద్రలేపింది. అతని చేతిలోని మూడురూపాయల బిళ్ళలు, అందమైన గుండీ జారి కిందపడ్డాయి.

ఆ అందమైన గుండీ, వాళ్ళ అమ్మకు ఇదివరకే వున్న పెళ్ళిగౌనుకు చక్కగా సరిపోయింది.

★ ★ ★

English Title : Snow drops
Writer : Spiridon Vangeli
English Translation : James Riordan



స్పిరిడాన్ వెంగిలి (1932–Present):
రుమేనియా పిల్లల రచయిత, కవి. ఎన్నో చిన్న పిల్లల పుస్తకాలు, నాటకాలు రాశారు. వారి రచనలకు ఎన్నో అవార్డులు వచ్చాయి.

చిత్రకారుల గురించి...

Fyodor Lemkul (1914-1995)

ఫయొదార్ లెమ్‌కుల్ రష్యన్ చిత్రకారులు. ఈయన జీవితమంతా బాల సాహిత్యం కోసం, అద్భుతమైన చిత్రాలు గీస్తూ గడిపారు. మార్షాక్, కార్నీ చుకోవ్‌స్కీ, మార్క్‌ట్వైన్ వంటి ఎందరో రచయితల పిల్లల పుస్తకాలకు అద్భుతమైన బొమ్మలు వేశారు. నూటముప్పై చిన్న పిల్లల పుస్తకాలకు బొమ్మలు వేశారీయన. భార్య ఎకతెరీనా పెత్రావనాతో కలిసి జీవితమంతా సేకరించిన 'యూరోపియన్, రష్యన్ గాజు సామగ్రిని', 'మ్యూజియం ఆఫ్ ప్రైయివేట్ కలెక్షన్స్' లో చూడవచ్చు.

ఈ పుస్తకంలోని మొదటి పది కథలకు అద్భుతమైన చిత్రాలు గీసింది ఈయనే. ఈ బొమ్మలు రాదుగ పబ్లిషర్స్, మాస్కో వారు 1984లో ప్రచురించిన 'ది ట్వల్వ్ మంత్స్' అన్న పుస్తకంలోనివి.

• • •

Vassily Shulzhenko (1945-Present)



వసిలీ షుల్‌జెన్కొ, 1945వ సంవత్సరంలో మాస్కోలో జన్మించారు. పదమూడవ ఏట నుండి చిత్రకళను అభ్యసించటం ప్రారంభించారు. 'జీవిత సత్యాలే తన చిత్రకళకు మూలం' అని వసిలీ షుల్‌జెన్కొ తన చిత్రాల గురించి చెప్పారు. ఇతను సమకాలీన రష్యన్ చిత్రకారులలో ప్రసిద్ధుడు. ఇతని చిత్రాలను యూరప్, అమెరికాలోని ఆర్ట్ గ్యాలరీలు కొనుక్కున్నాయి. 'టెంప్టేషన్', 'అంబులెన్స్', 'ఫాలెన్ బై' మొదలయినవి ఇతని చిత్రాలలో కొన్ని. రష్యన్ సమాజపు ఆత్మను ఆవిష్కరించిన అతి కొద్దిమందిలో ఈయన ఒకరు. మాస్కోలో నివసిస్తున్నారు.

ఈ పుస్తకంలోని చివరి పది కథలకు అందమైన రంగు రంగుల చిత్రాలను గీసింది ఈయనే. ఈ బొమ్మలు రాదుగ పబ్లిషర్స్, మాస్కో వారు 1983లో ప్రచురించిన 'ఎ హ్యాండ్ ఫుల్ ఆఫ్ స్టార్స్' అన్న పుస్తకంలోనివి.

ఈ చిత్రకారుల బొమ్మలే కాకుండా, ఇతర రష్యన్ చిత్రకారుల బొమ్మలు కూడా కథలకు వాడుకున్నాము. వాటి కింద ఆ చిత్రకారుల పేర్లు ఇచ్చాము.

REQUEST TO READERS

Telugu Readers Club would be glad to have your openion of this book, its translation, design and any suggestions you may have for future publications.

Please send all your comments to telugureadersclub@gmail.com

తెలుగు రీడర్స్ క్లబ్

Check List

Book Number	RMK01B184	**Date**	4/11/2021
Front Cover	yes	**Back Cover**	yes
Blank Pages	CI, 8B, 12B, 16B, 22B, 24B, 28B, 32B, 34B, 38B, 40B, 44B, 48B, 52B, 56B, 60B, 64B, 66B, 70B, 72B, 74B, 79		
Missing Pages	No		
Prepared By	Amrutha	**Cutting By**	Yameena
Scanned By	Amrutha	**Pages**	123